ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
17/3/08
శ్రీకాకుళం

మార్చి 9, 2008



పండు...పండూ...

అరటి పండ

హ్యాపీ బర్త్‌డే

(2008 మార్చి-9 నుంచి
2008 మార్చి-15 వరకు)

డి. సాయికిరణ్ రెడ్డి
5సం॥, మార్చి-9
మానస-మహేందర్‌రెడ్డి
అంబర్‌పేట్-హైదరాబాద్

కె. రిషికరామ్
మార్చి-9
సుజాత-రామ్మోహన్
విశ్వేశ్వరాయపురం-తూ॥గో॥

జె. సృజన(చిన్నారి)
1సం॥, మార్చి-10
సరిత-వెంకటేష్
ధర్మనగూడ-రంగారెడ్డి

కె. హిమబిందు
2సం॥, మార్చి-10
పద్మావతి-వెంకట్రావ్
ఒంగోలు- ప్రకాశం

హరిప్రియ(దిడ్డి)
10సం॥, మార్చి-9
మల్లీశ్వరి-భాస్కర్
మేదరిబజార్-ఖమ్మం

ఆర్. సుప్రియ-కాంతిప్రియ
మార్చి-9
భాగ్యలక్ష్మి-రమాశంకర్రావు
పొదలాడ-తూ॥గో॥

ఎ. ప్రసన్నకుమారి
4సం॥, మార్చి-11
సత్యవతి-నాగేశ్వరరావు
శ్రీనగర్-ఖమ్మం

ఎం. పండరినాథ్
శారద-శ్రీనివాసులు
కొల్లాపూర్-మహబూబ్‌నగర్



తెలుగుకు ప్రాచీన భాష హోదా ఇవ్వాలి

మన అతిథి

పేరు	:	వెలమల సిమ్మన్న
పుట్టిన తేది	:	1-03-1955
ఊరు	:	తిమడాం (గ్రామం), శ్రీకాకుళం (జిల్లా)
విద్య	:	ఎమ్.ఏ. పిహెచ్.డి సంస్కృతం (1981), హిందీ (1983), తమిళం (1984), ఉర్దూ (1987), లింగ్విస్టిక్స్ (1988), ట్రాన్స్‌లేషన్ (1991), ఫంక్షనల్ ఇంగ్లీషు (1993) డిప్లమోలు.
వృత్తి	:	ప్రొఫెసర్, తెలుగు విభాగం, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఆంధ్రా యూనివర్సిటీ
అభిరుచి	:	బోధన, పరిశోధన
ముద్రిత గ్రంథాలు	:	26 (భాష, సాహిత్యం, విమర్శ, వ్యాకరణకు సంబంధించి)
అవార్డులు	:	రఘుపతి వెంకటరత్నం నాయుడు బెస్ట్ థీసెస్ అవార్డు (ఆంధ్ర విశ్వ కళా పరిషత్-1985), బెస్ట్ రీసెర్చర్ అవార్డు (ఆంధ్ర విశ్వ కళా పరిషత్- 1995)
పురస్కారాలు	:	డాక్టర్ పిల్లి శాంసన్ స్మారక సాహితీ పురస్కారం (గుంటూరు-2003), 'సాహితీ మిత్రులు' సాహితీ పురస్కారం (మచిలీపట్నం-2005), ఆంధ్ర ప్రదేశ్ సాహితీ సాంస్కృతిక సమాఖ్య' ఉగాది పురస్కారం (శ్రీకాకుళం-2005), "రొక్కం రాధాకృష్ణ సాహితీ పురస్కారం", 'ఇండియన్ హైకూ క్లబ్' (అనకాపల్లి-2005), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార భాషా సంఘం-మంత్రి 'భాషా విశిష్ట పురస్కారం' (హైదరాబాద్-2006), 'ఆంధ్రసారస్వత సమితి' ఉగాది సాహిత్య ప్రతిభా పురస్కారం (సాహిత్య విమర్శలో మచిలీపట్నం-2006).

పాఠశాలల్లో ఐదవ తరగతివరకు తప్పనిసరిగా తెలుగు భాషను బోధించాలి. ఆ పైతరగతులలో తప్పనిసరిగా తెలుగు సబ్జెక్టు వుండాలి. అప్పుడు తెలుగు భాష పట్ల అభిమానం పెరుగుతుంది. తల్లిదండ్రులు కూడా అందుకు తగ్గట్టే పిల్లలకు తెలుగు భాష మీద అభిమానాన్ని పెంచాలి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లోనూ తెలుగులో బోర్డులు పెట్టాలి. తమిళవాళ్ల కన్నా భాషాభిమానం తెలుగువారికి తక్కువ. దానికి చాలా నిదర్శనాలున్నాయి. తెలుగు భాషకు మూడు వేల సంవత్సరాల భాషా సాహిత్యం వుంది. తెలుగుకు చెప్పకోదగ్గ వ్యాకరణం, విమర్శ కూడా వుంది. అయినా ప్రాచీన భాష హోదాను తమిళ భాషకు ఇచ్చి తెలుగు భాషకు ఇవ్వకపోవడం కేవలం రాజకీయమే. మనదేశంలో హిందీ తర్వాత అన్ని భాషల కన్నా తెలుగునే ఎక్కువగా మాట్లాడుతున్నారు. అటువంటి తెలుగుకు ప్రాచీన భాష హోదా ఇవ్వాలని, త్వరలో వస్తుందని ఆశిస్తాను.

ఈ సంచికలో....

టపా	...	2
విజ్ఞాన వీచిక...	...	3
నవ్వుల్... పువ్వుల్	...	4
సీరియల్	...	8
మనసా... తెలుసా	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
సమ్‌థింగ్ స్పెషల్	...	17

ఇంకా...

మంచిపుస్తకం ...6

జీవితమంత లోతైన కథలు

చూద్దామా ... 5

మనసును దోచే మనాలి

లాహిరి లాహిరిలో	...	20
సలహాలు	...	22
రుచి	...	23
కొత్త పుస్తకాలు	...	24

కథ ... 18

రాజకీయం



ఆకట్టుకున్న కృష్ణభగవాన్ కబుర్లు

ఫిబ్రవరి 24న ప్రచురించిన కృష్ణ భగవాన్ కబుర్లు బాగా ఆకట్టుకున్నాయి. హాస్యాన్ని పండించడంలోనూ హీరోగానూ పేరు పొందిన ఆయన మంచి మాటకారి. ఆయనతో షూటింగ్ చేయడం అంటే తోటి నటీనటులకూ సరదానే. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరినీ మాటల్తో ఉతికి ఆరేస్తారు. ఆయన నటించిన ప్రతి సినిమాలోనూ హాస్యం బాగుంటుంది. కమెడియన్ నుంచి ఒక మంచి హీరోగా ఎదగాలని కోరుకుంటున్నాము.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

విద్యార్థులకు ఉపయోగకరం

ఈ వారం కవర్ స్టోరీ బాగుంది. పరీక్షలంటే భయమేల! కవర్ స్టోరీ విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంది. పరీక్షలంటే చాలు శారీరక, మానసిక ఒత్తిడులకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుచున్న విద్యార్థులకు ఈ వ్యాసం కొంత ఓదార్పు కలిగిస్తుంది. తల్లిదండ్రులు విషయాన్ని అవగాహన చేసుకొని పిల్లలకు ధైర్యం చెప్పాలి. 'కన్యాశుల్కం - 19వ శతాబ్ది ఆధునిక భారతీయ నాటకాలు' గ్రంథ పరిచయం సందేశాత్మకమైనది. నిజంగానే మంచి పుస్తకం. విజ్ఞాన వీచికాంశం సిపిఐఎం - పర్యావరణం విజ్ఞాన దాయకంగా వుంది. సిపిఎం 19వ జాతీయ మహాసభ పర్యావరణ అంశంపై తీర్మానంలో పేర్కొన్నందుకు అభినందనలు.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

'పాపాయి డైరీ' చాలా బాగుంది

ఆదివారం అనుబంధం స్నేహలో హాపీబర్త్‌డే, సీరియల్, సినిమా కబుర్లు, తమాషా బొమ్మలు, అట్టమీది కథ, కలం స్నేహం మాకు అందిస్తున్నందుకు చాలా సంతోషం. ముఖ్యంగా ఆదివారం వచ్చిందంటే పిల్లలు చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ వారం 'టూ మచ్'లో ప్రచురితమైన రెండు తలల జంతువులు, పసికందులు, వృక్షాలు చూసి ఆశ్చర్యపోయాం. ఎప్పుడూ ఇలాంటి విచిత్రాలు చూడలేదు. ఇలాంటి మంచి సన్నివేశాలను అందించిన స్నేహకు కృతజ్ఞతలు. అలాగే ఈ వారం కథ 'పాపాయి డైరీ' చాలా బాగుంది. ప్రతి మనిషికి ఒక డైరీ అవసరం. ఇలాంటి మంచి కథలు అందించాలని అంజన గార్ని అభినందిస్తూ ... కోరుకుంటున్నాము.

ఎం. సంతోషికుమారి,
రాజీవ్‌నగర్, విజయనగరం.

విద్యార్థులంతా చదవాల్సిన 'కవర్'

ఈ పరీక్షల కాలంలో "పరీక్ష" అంటే భయపడే విద్యార్థుల కోసం ఎంతో అమూల్యమైన జాగ్రత్తలను, సూచనలను, సరైన స్టడీ ప్లాన్ మొదలైన విషయాలను 24.2.08 నాటి ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో హిప్నో కమలాకర్ గారు చక్కగా వివరించారు. విద్యార్థులందరూ తప్పక చదవాల్సిన వ్యాసం ఇది. అలాగే.... సి.పి.ఐ.ఎం ఎజెండాలో కీలకాంశమైన పర్యావరణ సమస్యను గురించీ, కాలుష్యాన్ని తగ్గించడంలో అగ్రరాజ్య ధిక్కార స్వరాన్నీ వెంకట్రావు గారు "విజ్ఞాన వీచిక" శీర్షికలో చక్కగా వివరించారు. రక్తపోటుతో కలిగే అనర్థాలను గురించి, వచ్చే అవకాశాలను గురించి డాక్టర్‌గారి వివరణను "ఆరోగ్యం" శీర్షికలో చదివాం. ప్రతి వారం ఎన్నో మంచి శీర్షికలను అందిస్తున్న ఎడిటర్ గార్కి ధన్య వాదాలు.

గొల్లమందల సురేష్‌కుమార్,
సీతారాంపురం, ఖమ్మం.

కథ అద్భుతం

ఫిబ్రవరి చివరి ఆదివారం సంచిక 'స్నేహ' అట్టమీది కథగా పరీక్షలను ఎదుర్కొనే వారందరికీ ప్రణాళికాబద్ధంగా ఎలా చదవాలో, చాలా చక్కగా సూచనలు చేయడం ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంది. "పాపాయి డైరీ" కథ అద్భుతంగా రాసిన అంజన గారు అభినందనీయులు. "టూ...మచ్"! స్కెచ్‌లు చూశాక 'ప్రపంచంలో ఇన్ని వింతలున్నాయా' అని ఆశ్చర్యచకితులమయ్యాం. "విజ్ఞాన వీచిక' అమూల్యమైన విశేషాలను అందిస్తోంది. 'ఆరోగ్యం' శీర్షికలో రక్తపోటు సంగతులు అవగాహన కలిగింపజేశాయి. "చూద్దామా"లో భరత్‌పూర్ విశేషాలు ఒక కొత్త ప్రదేశాన్ని పరిచయం చేశాయి. "సినిమా కబుర్లు" ద్వారా, కృష్ణ భగవాన్, రమణమహర్షి భక్తులని, ఆయన రచయిత కూడా అనీ తెలుసుకున్నాం. ఇంకా బాలల కథ 'ముందుచూపు' కథకు తగ్గట్టు, రంగుల చిత్రాలు బాగా ఆకట్టుకున్నాయి. సమాజహితం కోరేదే సాహిత్యం అంటున్న మన అతిథి డా॥ శాంతి నారాయణ గారి భావాలు ఉన్నతంగా ఉన్నాయి. ధన్యవాదాలు.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం,
శ్రీకాకుళం టౌన్.



ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించ చండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

విజ్ఞాన వీచిక

కథా నిలయం
శ్రీకాకుళం

మనుషులూ-మరమనుషులూ

ఎస్. వెంకట్రావు



మరమనుషులు, రోబోలను...ఈ మాటలు వినగానే మనకు స్టార్‌వార్స్ చిత్రంలో మరమనుషుల విన్యాసాలూ, టెర్మినేటర్ చిత్రంలోనో లేక రోబోకాప్‌లోనో మనుషులను పోలిన మరమనుషులు- 'హ్యూమనాయిడ్స్' ప్రదర్శించే తెలివి తేటలూ గుర్తుకు వస్తాయి. మానవ జీవితంలోకి యంత్రాలు ప్రవేశించినప్పటినుండీ మర మనుషుల గురించి పరిశోధనలు జరుగుతున్నాయి. 'మనిషి శరీరం యంత్రం లాగా పనిచేస్తుంది కాబట్టి మనిషిని పోలిన యంత్రాన్ని ఎందుకు తయారు చేయకూడదు?' అన్న దాంతో మరమనుషుల నిర్మాణానికి పూనుకున్నారు. కంప్యూటర్ల ప్రవేశంతో తెలివి తేటలు గల మరమనుషులను తయారుచేయవచ్చుననుకున్నారు. అంటే మనిషి మాదిరిగా పనిచేయడమే కాదు, మనిషి మాదిరిగా ఆలోచించే మరమనుషలన్న మాట. మొదటి రకం మరమనుషులను రోబోలు అంటే, రెండో రకాన్ని హ్యూమనాయిడ్స్ అన్నారు. అంటే మనిషిని పోలిన మరమనిషి అన్నమాట.

కాని విశేషమేమంటే శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందినప్పటికీ మనిషిని పోలిన మరమనిషి సృష్టించడంలో మాత్రం పెద్దగా పురోగతి లేదు. దానర్థం రోబోలను తయారుచేయలేదని కాదు. నిజానికి ఇప్పటికిప్పుడు అనేక రకాల రోబోలను మనుషులకు అనేక విధాల తోడ్పడు తున్నాయి. రోబోలను తయారీలోనూ, అభివృద్ధిలోనూ దిట్టలైన జపాన్ వారు అనేక పారిశ్రామిక పనుల్లో రోబోలను ఉపయోగించుకుంటున్నారు. ముఖ్యంగా కార్లు, మోటారు వాహనాల తయారీ పరిశ్రమలో ప్రపంచ వ్యాపితంగా రోబోలు పెద్ద ఎత్తున ఉపయోగపడుతున్నాయి. కార్ల ఫ్యాక్టరీ అసెంబ్లీ లైన్స్‌లో రోబోలు ఇప్పుడు ఎక్కువ పనిచేస్తున్నాయి. అలాగే మందుల పరిశ్రమ, ఇతర ఉత్పాదక పరిశ్రమల్లో పెద్ద ఎత్తున రోబోలను ఉపయోగిస్తున్నారు. అంతే కాకుండా భూకంపాల వంటివి వచ్చినప్పుడు భవన శిథిలాల కిందకు వెళ్లి పరిశీలన చేసేందుకూ, సముద్ర గర్భంలో పరిశోధనలకూ, బాంబులను నిర్వీర్యం చేయడం వంటి పనులకు రోబోలను గణనీయంగానే ఉపయోగిస్తున్నారు.

అయితే ఈ విధంగా ఉపయోగించే రోబోలన్నీ పరిమితమైన పనులు చేసేవే. అవి మనిషికి తోడ్పాటు నందించేది కూడా పరిమితంగానే. కాని నిజానికి మనిషి కోరుకుంటున్నదీ, ఆశిస్తున్నదీ, కలలు కంటున్నదీ ఇటువంటి రోబోలకోసం కాదు. మనిషి భాషను అర్థం చేసుకుని, అతను చెప్పే పనులను అడ్డంకులను అధిగమించి చేయగల రోబోలు కావాలన్నది అసలు వాంఛ. ఇటువంటి రోబోలు తయారైన రోజున రోబోలు నిజంగా మనిషి పనికి తోడ్పడతాయి. అప్పుడు మనిషి తన పనులను రోబోలకు అప్పగించ గలుగుతాడు. ఇంకా చెప్పాలంటే మనిషికి తోడునీడగా ఉండే రోబోలు రావాలి. అంటే మనిషికి ఒక సేవకుడు చేసే అన్ని రకాల పనులూ చేసే రోబోలు రావాలి. ఇంటి పని చేయాలి, వంటపని చేయాలి, పిఎ పని చేయాలి. ఇవన్నీ చేయాలంటే యజమాని ఏం చెప్పాడో అర్థం చేసుకుని దానికి అనుగుణంగా పనులు చేసుకుపోగల రోబోలు తయారు కావాలి. కాని అటువంటి రోబోల తయారీకి మానవాళి ఇంకా చాలా దూరంలో ఉంది. ఉదాహరణకు: ఇప్పుడు కార్ల ఫ్యాక్టరీల్లో పనిచేసే రోబోలు ఒక మనిషి చేయి చేసే వేలాది రకాల పనుల్లో ఒకటో, రెండో పనులు మాత్రమే చేయగలదు. అది కూడా దాని మెమరీ చిప్‌లోకి ఏ ఆదేశాలు ఎక్కించారో ఆ పనులు మాత్రమే మళ్లీ, మళ్లీ చేసుకుపోతుంది కాని ఏదైనా అడ్డం వస్తే దాన్ని తొలగించుకుపోగల తెలివి తేటలు ఈ రోబోలకు లేవు. కాని మనిషికి సేవకులుగా ఉండాలి అంటే రోబోలు ముందు ఆ మనిషి మాట్లాడే భాష అర్థం చేసుకోవాలి, అతను చెప్పే పని చేసేటప్పుడు అక్కడి వాతావరణానికి అంటే గదిలో అయితే గదిలో, తోటలో అయితే తోటలో ఎక్కడైతే అక్కడ ఉన్న పరిసరాలకు అనుగుణంగా పనిచేయాలి. ఉదాహరణకు: గ్లాసుతో నీళ్లు తీసుకురా అని యజమాని ఆదేశిస్తే ఒక సేవకుడో, సేవకురాలో అయితే గ్లాసు ఎక్కడ ఉందో వెదికి తీసుకుని, నీళ్ల పాత్ర ఎక్కడుందో తెలుసుకుని అక్కడకు వెళ్లి, నీళ్లు పట్టి యజమాని ఎక్కడ ఉంటే అక్కడకు తెచ్చి ఇస్తారు. ఈ క్రమంలో సేవకుడు/సేవకురాలు అక్కడి పరిసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తారు. ఇంగ్లీషులో దీన్ని పరిసరాలకు అడాప్ట్ అవడం అంటాం. అలాగే సేవకుడు/సేవకురాలు యజమాని చెప్పే విషయాన్ని అర్థం చేసుకుని దానికను గుణంగా వ్యవహరిస్తుంది. కాని ఇప్పుడు పనిచేస్తున్న ఎంతో ఆధునిక కంప్యూటర్లు కూడా పరిసరాలకు అనుగుణంగా వ్యవహరించలేవు. చెప్పింది అర్థం చేసుకుని వ్యవహరించలేవు. అంటే అడాప్ట్ కాలేవు. నిజానికి ఈ విధంగా పరిసరాలకు అనుగుణంగా వ్యవహరించే, అర్థం చేసుకునే రోబోలను నిర్మించలేనంత కాలం రోబోల వల్ల మనిషికి చేకూరే ప్రయోజనాలు చాలా పరిమితంగానే ఉంటాయి. మనిషి కోరుకునే రోబోలు హ్యూమనాయిడ్‌లూ సినిమాలకూ, సైన్సు నవలలకూ మాత్రమే పరిమితమవుతాయి.

అయితే ఇటీవల ఒక సంవత్సర కాలంగా రోబోటిక్స్‌లో అంటే మరమనుషుల సృష్టికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలు మానవుని కలలు నెరవేరుతాయన్న ఆశలు కల్పిస్తున్నాయి. వాటిలో ఏడాది క్రితం తయారైన 'డోమో' అనే రోబో నిర్మాణం ఒకటి కాగా, ఈ నెలలోనే సరికొత్తగా తయారైన 'ఐకబ్' అనే రోబో మరోటి. మొదటి తరహా రోబో కేవలం పనులు చేయడమే కాకుండా తను పనిచేసే గదిలో, లేకుంటే పని ప్రదేశంలోని వాతావరణానికి అనుగుణంగా వ్యవహరించగలదు. యజమాని చేయమన్న పనిని చేయడంలో అక్కడి పరిసరాలకు అనుగుణంగా వ్యవహరించగలదు. ఇలా చేయడానికి 'డోమో'లో అమర్చిన కంప్యూటర్ చిప్స్‌తో కూడిన 29 మోటార్లూ, ఒక డజనుకు పైగా కంప్యూటర్లూ, రెండు కళ్ళకు అమర్చిన శక్తివంతమైన కెమెరాలూ కారణం. కళ్లు చూసిన విషయాలను, రోబో విన్న విషయాలను, లేదా అది గ్రహించిన విషయాలను డజను కంప్యూటర్లు స్వీకరించి ఎప్పటికప్పుడు విశ్లేషించి మెమరీ చిప్స్‌తో కూడిన మోటార్లకు ఆదేశాలు పంపుతాయి. ఆ ఆదేశాలకు అనుగుణంగా మోటార్లు పనిచేయడం వల్ల 'డోమో' కాళ్లూ, చేతులూ పనిచేస్తాయి. ఈ రోబో యజమాని ఇచ్చిన వస్తువు సైజును గుర్తు పెట్టగలదు. ఉదాహరణకు, దీన్ని తయారుచేసిన ఎంఐటి హ్యూమనాయిడ్ రోబోటిక్స్ గ్రూపుకు చెందిన ఆరోన్ ఎడ్సింగర్ ఒక కాఫీగింజల పొట్లాం ఇచ్చి 'డోమో' దీన్ని షెల్ఫ్‌లో పెట్టమనగానే రోబో ఆ పొట్లాన్ని అందుకుని దాని సైజును గ్రహించి షెల్ఫ్ ఎక్కడుందో కనుక్కుని ఆ షెల్ఫ్‌లో ఆ పొట్లాం ఎక్కడుంటే పద్ధతిగా ఉంటుందో ఆ విధంగా అమర్చ గలిగింది. సరిగ్గా ఒంటరి జీవితాలకు సేవలు చేసే హ్యూమనాయిడ్‌లకు ఇటువంటి అడాప్టబిలిటీ అంటే పరిసరాలకు అనుగుణంగా వ్యవహరించగలిగే సామర్థ్యం కావాలి. డోమోలో అటువంటి సామర్థ్యాలను శాస్త్రనిపుణులు ప్రవేశపెట్టగలిగారు. అయితే ఇది ఇంకా ప్రోటోటైప్ మాత్రమే. ఇంకా దాన్ని అభివృద్ధి చేస్తే అనేక రకాలుగా ఇటువంటి రోబోలు మనుషులకు ఉపయోగపడతాయి.

ఇక అమెరికాలోని హెర్ట్‌ఫోర్డ్‌షైర్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ క్రిష్టోఫర్ నెహోవిన్, ప్రొఫెసర్ కెర్‌స్టిన్ డ్యూటనెహోన్‌లు తయారు చేసిన ఐకాబ్ అనే రోబోట్ ఏకంగా మన భాషను కూడా చేర్చుకోగలదు. ఉదాహరణకు ఐకాబ్‌తో కొన్ని రకాల పనులు చేయించే క్రమంలో విన్న పదాలను కూర్చుకుని అది కొత్త వాక్యాలను నిర్మించగలదు. అంటే కొత్త పనుల కోసం కొత్త ఆదేశాలను తయారుచేయగలదు. అంటే మనిషిలా ఆలోచించే తత్వాన్ని ఈ రోబోట్ అలవరుచుకుందన్న మాట. ప్రొఫెసర్లు ఐకాబ్‌కు వివిధ రకాలైన వస్తువులు ఇచ్చి ఒక పెట్టెలో ఆ వస్తువులు పట్టే కంతల్లో పెట్టమని చెప్పారు. తను చేసిన పనులేమిటో చెప్పమంటే రోబో తనకు యజమానులు నేర్పిన పదాలన్నిటినీ కూర్చి 'రోబో ఒక చెక్కమీద కర్ర పెట్టింది' అన్న వాక్యాన్ని తయారు చేసింది. ఇది తల్లి/తండ్రి చెప్పే చిన్న చిన్న పదాలను పిల్లలు అర్థం చేసుకుని వాటితో వాక్యాలు తయారుచేయడం వంటిదే అంటే తల్లి/తండ్రి పిల్లలకు భాష నేర్పే పద్ధతే ప్రొఫెసర్లు చెప్పారు. మరమనుషులు భాష నేర్చుకోవడం, పరిసరాలకు అనుగుణంగా వ్యవహరించడం చేశాయంటే అవి మనుషులకు మరింత చేరువైనాయన్న మాటే. మనుషులూ, మరమనుషులూ కలిసి జీవించే రోజు దగ్గరకొస్తున్నట్లు లేదూ!

రిలాక్సింగ్

ఒక రోజు అక్బర్ సింగ్ బీచ్‌లో సేద తీరుతుంటాడు. అతని దగ్గరకు ఒకడు వచ్చి ఆంగ్లంలో "ఆర్ యూ రిలాక్సింగ్" అని అంటాడు. అప్పుడు అక్బర్ సింగ్ 'నో! ఐ యామ్ అక్బర్ సింగ్' అంటాడు. ఇలా అతణ్ణి ఐదుగురు వచ్చి అడుగుతారు. వారి మాటలకు కోప్పడి అక్కడ్నుంచి పోయి ఒక బెంచిలో కూర్చుంటాడు సింగ్. తన పక్కన బల్లమీద కూర్చున్న వ్యక్తిని 'ఆర్ యూ రిలాక్సింగ్" అని అడుగుతాడు సింగ్. అతను ఎస్ అంటాడు. అప్పుడు అక్బర్ సింగ్ 'ఒరేయ్! నీ కోసం అక్కడ ఐదుగురు చూస్తున్నార్రా!' అంటాడు.

డి. చంటి, హరిత, కె.ఎస్.పి. రోడ్. న్యూ పాల్వంచ.

సైతాన్ కాదు

తల్లి: బాలూ! పిల్లిని అలా తన్నొచ్చా? సైతానే నీతో ఇలాంటి పనులు

చేయిస్తున్నాడు.

బాలు: లేదమ్మా ఇది పూర్తిగా నా ఐడియానే.

పెళ్లిరోజు

రవి: ఇవాళ మా అమ్మ పెళ్ళి రోజు.

రేణు: ఔనా, మా అమ్మకు ఎప్పుడో పెళ్ళి అయిపోయింది.

తెలుసా?

టీచర్: రోజూ స్కూల్‌కు రానివాళ్ళు ఎక్కడికి వెళ్తారో

తెలుసా?

పండు: సినిమాకు

ముల్లు

అమ్మ: దీన్ని బట్టి ముల్లును ముల్లుతోనే తీయాలని అర్థమైంది కదూ!

బుజ్జి : మరి నువ్వెప్పుడూ ముల్లును పిన్నీస్‌తో తీస్తావు ఎందుకమ్మా...!

ఎస్.కె. గౌస్, సంతపేట, నెల్లూరు.

డూప్లికేట్ తాళంచెవి

కిరణ్: నేను ఒక తాళంచెవి మింగేశాను.

డాక్టర్: ఎప్పుడు?

కిరణ్: మూడు నెలల క్రితం!

డాక్టర్: మరి ఇప్పటి వరకు డాక్టర్‌ని ఎందుకు కలవలేదు?

కిరణ్: నేను డూప్లికేట్ తాళం వాడుతున్నా. అయితే ఇప్పుడు అది పోయింది.

కాలింగ్ బెల్

కాలింగ్ బెల్ పాడవడంతో... రిపేర్ చేసేవాళ్లకి నాలుగు రోజులుగా ఫోన్ చేయసాగింది ఓ గృహిణి. అయినా ఫలితం లేక పోయింది.

ఐదవసారి ఫోన్ చేస్తే...

రిపేర్ చేసే వ్యక్తి ఇలా అన్నాడు: నేను నాలుగు రోజులుగా రోజూ వస్తున్నాను మేడమ్! కాలింగ్ బెల్ కొట్టినా ఎవరూ బయటికి రావడం లేదు.

గృహిణి: ఆఁ...

మరో కూర

సుమతి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి...

సుమతి: ఇన్‌స్పెక్టర్‌గారూ! మా ఆయన ఐదు రోజుల క్రితం బంగాళదుంపలు కొనుక్కురావడాని కని మార్కెట్‌కి వెళ్లారు. ఇంతవరకు తిరిగి రాలేదు.

ఇన్‌స్పెక్టర్: అవునా తల్లీ! నువ్వు మరేదైనా కూర వండు కోవచ్చుకదా!

ఫ్రీ

సర్దార్జీ సరుకులు తేవడానికి షాపుకి వెళ్లాడు

సర్దార్జీ: నూనె కొన్నాం కదా. మరి ఫ్రీ గిఫ్ట్ ఇవ్వరా!

షాపు అతను: దీనికి ఫ్రీ ఏదీ రాదు సార్.

సర్దార్జీ: కానీ దీని మీద 'కొలెస్ట్రాల్ ఫ్రీ' అని రాసి వుందికదా.

జోర్ సే బోలో...

టీచర్: ఎ ఫర్!

రాము: యాపిల్

టీచర్: జోర్ సే బోలో...

రాము: జై మాతా జీ

ముక్కలు

మోహన్ పిజాకు ఆర్డర్ ఇచ్చాడు

వెయిటర్: సర్! దీన్ని నాలుగు ముక్కలు చెయ్యమంటారా? ఎనిమిది ముక్కలు చెయ్యమంటారా?

మోహన్: నాలుగు చాల్లే. నేను ఎనిమిది ముక్కలు తినలేను!

అయోధ్య

రాఘవ ఒక నెంబర్‌కు ఫోన్ చేస్తాడు

రాఘవ: ఎవరండీ మాట్లాడేది?

అమ్మాయి: నేను సీత నండీ.

రాఘవ: నేను చండీఘర్‌కు ఫోన్ చేస్తే అయోధ్యకు ఎలా వెళ్లిందీ...

కాపీ

ఇద్దరు పిల్లలు పరీక్ష రాశాక తగాదా పడసాగారు

టీచర్: ఎందుకు తగాదా పడుతున్నారు?

మొదటివాడు: వీడు ఖాళీ ఆన్సర్ షీట్ ఇచ్చేశాడు సార్.

టీచర్: అయితే ఏంటంట?

మొదటివాడు: నేను కూడా అలాగే చేశానుసార్! పేపర్లు దిద్దేటప్పుడు టీచర్ ఇది చూసి ... నేను వాడి దాంట్లో కాపీ కొట్టానని అనుకుంటారేమోనని సార్!

కిడ్నీ

ఒక సర్దార్జీ ఈ మధ్యనుంచే స్పోకెన్ ఇంగ్లీషు నేర్చుకోసాగాడు. ఒక పార్టీలో తన ఆంగ్ల పాండిత్యాన్ని ప్రదర్శించాలను కుంటాడు.

హలో సార్! అయామ్ సర్దార్, దిస్ ఈజ్ మై సర్దారిణి (భార్యను చూపించి),

హి ఈజ్ మై కిడ్ (కొడుకును చూపించి),

అండ్ షి ఈజ్ మై కిడ్నీ (కూతుర్ని చూపించి) అంటాడు.

విజయ్, హైదరాబాద్.







చూద్దాము...

యాజీవ్

మనసును దోచే మనాలి



వేసవి కాలంలో ఏదైనా చల్లని, ప్రశాంతమైన ప్రదేశానికి వెళ్ళి ఉంటే బావుంటుందనిపిస్తుంది. అటువంటి చల్లని, ఆహ్లాదకరమైన హిల్ రిసార్ట్ మనాలి. హిమాచల్ ప్రదేశ్‌లో కులు లోయ ఉంది. అందమైన ఈ కులు లోయకు ఉత్తర భాగాన మనాలి ఉంది. హిమాచల్ ప్రదేశ్ రాజధాని షిమ్లాకి దాదాపు 280 కిమీ దూరాన ఉంది. సముద్ర మట్టానికి 2050 మీటర్ల ఎత్తున, బియాస్ నదీ తీరం వెంబడి ఉండే మనాలి ప్రకృతి ఆరాధకులకు, సహసోపేతమైన ట్రెక్కింగ్ అంటే ఇష్టపడే వాళ్ళకి అన్ని విధాలా నచ్చే స్థలం.



ఎటు చూసినా కొండలు, లోయలు, పచ్చదనం, ఎత్తైన దేవదారు వృక్షాలు, వాటి మధ్యన నడుస్తుంటే చందమామ కథలోని దేవతావనం లా అనిపిస్తుంది. ప్రపంచమంతా వరదలో నాశనమైనపుడు 'మను' ఇక్కడే పడవ దిగి మనష్యులను సృష్టించాడని అంటారు. స్వచ్ఛమైన బియస్ జలాలు, జలపాతాలు, మంచుకొండలు, పండ్ల చెట్లు... అన్నీ కలిపి మనాలిని మన దేశపు స్విట్జర్లాండ్ అనిపిస్తాయి.

మనాలి వెళ్లి, ఒక చెట్టు కింద పడుకుని, అలా చెట్ల కిందే రోజులు గడిపెయ్యవచ్చు మరెక్కడికీ వెళ్లకుండా. కానీ దగ్గర్లోనే కొన్ని చూడదగ్గ ప్రదేశాలున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి

హిడింబ దేవాలయం: భీముని భార్య పేరుతో కట్టిన నాలుగంతస్థుల లాంటి ఈ దేవాలయాన్ని బహదూర్ సింగ్ అనే రాజు 1553 ప్రాంతంలో నిర్మించాడని అంటారు. లోపల దేవి విగ్రహం, ఆమె కాలి గుర్తులుగా చెప్పబడుతున్న ముద్రలు ఉంటాయి. ప్రతి మే నెలలో హిడింబ పండుగ కూడా ఆచరిస్తారు. అలాగే మను దేవాలయం, బుద్ధుడి విగ్రహం ఈ చుట్టు పక్కల ఉంటాయి.

మనాలి కీలాంగ్ రోడ్డులో అతి ఎత్తైన ప్రదేశం రోతంగ్ పాస్. సముద్ర మట్టానికి 13,050 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండ మార్గం మండు వేసవిలోనూ చలి పుట్టిస్తుంది. చలి కాలంలో అయితే ఈ మార్గాన్ని మూసివేస్తారు. ఇక్కడి నుండి అవాక్కైపోయేంత అద్భుత ప్రకృతి దృశ్యం కనిపిస్తుంది. బియాస్ కుండ్ అనేది బియాస్ నది పుట్టిన స్థలం. అది కూడా దీనికి దగ్గర్లోనే ఉంది.

వసిష్ట్ గ్రామం: మనాలికి మూడు కిమీ దూరాన వసిష్ట్ అనే గ్రామం ఉంది. అది గంధకం కలిసిన వేడినీటి ఊటలకు ప్రసిద్ధి. ఆరోగ్యానికి మేలు చేసే ఈ గంధకపు నీటి స్నానాల కోసం చాలా మంది వస్తుంటారు.

మనాలికి 13 కీమీ దూరంలో స్నో పాయింట్ ఉంది. సోలాంగ్ లోయనే అలా పిలుస్తారు.

మనాలి నుండి రోతంగ్ పాస్‌కి వెళ్ళే దారిలో అద్భుతమైన రహలా జలపాతం మనల్ని కట్టిపడేస్తుంది. అంత అందమైన జలపాతమది.

నదిలో రాఫ్టింగ్, మంచుమీద స్కీయింగ్, గాలిలో పారా గ్లైడింగ్, కొండలపై ట్రెక్కింగ్, లోయలో స్నో స్కూటరింగ్ వంటి ఎన్నో ఉత్సాహభరితమైన, సాహసోపేతమైన క్రీడలు కూడా ఇక్కడ అందుబాటులో ఉంటాయి. .

పాత మనాలిలో మంచి మార్కెట్ ఉంది. షాల్, స్వెటర్ వంటి ఉన్ని వస్త్రాలు నాణ్యమైనవి లభిస్తాయి. ఇటువంటి అన్ని టూరిస్ట్ సెంటర్లలో లాగే ఇక్కడా మభ్యపెట్టి మోసం చేసే వాళ్లుంటారు. ముఖ్యంగా కుంకుమ పువ్వు అమ్మేవాళ్లు.

ఇక్కడ భోజనానికి ఇబ్బంది ఉండదు. ఎటువంటి ఆహారం కావాలన్నా లభిస్తుంది. రుచికరమైన ఊట నీళ్ళు పుష్కలంగా ఉంటాయి. ఎటు చూసినా యాపిల్ పండ్లుంటాయి. కానీ ఎండాకాలంలో సందర్శకుల తాకిడి ఎక్కువ. ఉండటానికి చోటే దొరకడం కష్టం! కాబట్టి మే, జూన్ మాసాలలో ఉండటానికి కాస్త ఇబ్బంది.

ఢిల్లీ నుండి 570 కీమీ, సిమ్లా నుండి 280 కీమీ ఉన్న మనాలి జాతీయ రహదారి 21పై ఉంది. కాబట్టి అనేక విధాలుగా ఈ ప్రదేశాన్ని చేరవచ్చు. ఉత్తరాది ప్రాంతాల ప్రకృతి అందమంతా బహుశా హిమాచల్ ప్రదేశ్ నుండే ప్రారంభమై అటు కాశ్మీర్‌కు కొనసాగిందా అన్నంత అందంగా ఉండే మనాలి గురించి ఇంకేమనాలి? వీలున్న వాళ్లు తప్పక చూడవలసిన ప్రదేశం.

❄



ఎన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు

కేవలం నలభై నాలుగు సంవత్సరాలు మాత్రమే జీవించినప్పటికీ (1860-1904) ప్రపంచ కథా సాహిత్యంలోనేగాక, ప్రపంచ నాటకరంగం మీద చెహోవ్ వేసిన ముద్ర ఎన్నటికీ చెరిగిపోదు. అటువంటి మహారచయిత కథలను ఇటీవల ముక్తవరం పార్థసారథి తెలుగులోకి అనువదించి సాహితీప్రియులకు మహోపకారం చేశారు.

చెహోవ్‌కు తీరిగ్గా పెద్ద కథలు రాసే అవకాశం లేదు. ఒకటి రెండు గంటల్లో అతి తక్కువ మాటల్లో ఎక్కువ భావాన్ని చెప్పడం అలా అలవాటైంది. హైస్కూలు తర్వాత వైద్య విద్య చదివి, కొంత కాలం డాక్టర్‌గా ప్రాక్టీసు చేసినా, తన ప్రవృత్తి సాహిత్యమేనని గ్రహించాడు. అధో జగత్ సహోదరుల కష్టాలు స్వయంగా చూసి, పరిశీలించి, తన కథల్లో విశ్లేషించాడు.



జీవితమంత లోతైన కథలు

చెహోవ్ రాసిన కథలు వంద సంవత్సరాల తర్వాత ... నేటికీ నిత్యనూతనంగా కనిపిస్తాయి. పాత్రల పేర్లు, ప్రదేశాల పేర్లు మారిస్తే తెలుగు కథల్లోనే మన ఊళ్ళోనే, మన ఇంటి చుట్టు పక్కల జరిగినట్లు, జరుగుతున్నట్లు అనిపిస్తాయి. ఆయన కథల్లో ఎక్కడా అనవసరంగా ఒక వాక్యం గానీ, మాటగానీ కనిపించదు. ఏ పాత్ర మనస్తత్వానికి తగ్గట్టు ఆ పాత్ర, ఏ కథకు తగిన వాతావరణాన్ని ఆ కథకు సృష్టించడం ఆయనకే చెల్లింది. ఎలాంటి కథనైనా అలవోకగా చెబుతాడు. అయితే పాఠకులు వాటినంత తేలిగ్గా మరచిపోలేరు. ఆయా సన్నివేశాల్లో జీవిత సత్యాలను రంగరించి చెబుతూనే హాస్యరసాన్ని అద్భుతంగా మేళవిస్తాడు. ఆ హాస్యం గిలిగింతలు పెట్టే సున్నిత హాస్యం. అది మనకు నవ్వుతో పాటు ఆలోచనల్నీ రేకెత్తిస్తుంది. జాలినీ కలిగిస్తుంది. విషాదాన్ని పంచి పెడుతుంది. మచ్చుకు కొన్ని కథల్ని చూడండి.

"ఆపిల్ దొంగ" అనే కథ ధనికులు చేసే తమాషాలు పేదవారికెంతటి దుర్భరంగా వుంటాయో ఛలోక్తుల్ని మేళవించి మరీ చెబుతాడు. ట్రిఫాన్ అనే ధనికుడి పళ్లతోటలో అట్టడుగు వర్గానికి చెందిన ఓ ప్రియుడు తన ప్రేయసి కోసం ఓ ఆపిల్ పండును కోసిచ్చి నేరం చేశాడు. అందుకు శిక్షగా ప్రేయసీ ప్రియులిద్దరూ ఒకరి చెంప ఒకరు కొట్టుకొమ్మని ఆజ్ఞాపించాడు ట్రిఫాన్. గత్యంతరం లేని స్థితిలో ఆ పని చేసినా వారిద్దరూ ఆ తర్వాత ఒకరి మొహం మరొకరు చూసుకోలేక అంతటితో విడిపోతారు. ఇక "లోకం చూడని కన్నీరు" అనే కథలో తన తాగుబోతు మిత్రబృందానికి తిండి పెట్టడం కోసం భార్య తిట్లను కూడా దీవెనలుగా భావిస్తాడు ఓ తాగుబోతు. సారా ఏరులుగా పారే ఆంధ్రదేశంలోను ఇలాంటి భర్తలు ప్రతి చోటా తగుల్తూనే ఉంటారు కదా! "వృద్ధాశ్రమం" అనే కథలో ధనవంతుడైన ఓ వృద్ధుడు తన కొడుకు వంశగౌరవాన్ని చూడకుండా ఓ నటిని పెళ్ళి చేసుకున్నందుకు వారిని తిండిక్కూడా మాడేట్లు చేసి, తను మాత్రం. విలాస జీవితాన్ని గడుపుతుంటాడు.

సంసారమనే జైల్లో బందిఖానా అయిన స్త్రీలు- చిన్నప్పటి తమ అభిరుచుల్ని, అభినివేశాల్ని మరచిపోయినా, జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు వాటిని ప్రదర్శించే స్వేచ్ఛ లభిస్తుంది. అయితే ఆ కొద్ది స్వేచ్ఛను కూడా వారి భర్తలు సహించరు కదా! నిస్సహాయులైన ఆ భార్యలు చేసే ప్రతిక్రియ ఎలా వుంటుంది? ఏడ్చుకుంటూ అయినా ఆ బందిఖానాకే తలవంచక తప్పదని "భర్త" కథలో చెబుతాడు రచయిత.

నిస్సహాయులైన పని పిల్లలకు ఇవ్వాల్సిన జీతాన్ని కూడా ఇవ్వక, రకరకాల పేర్లతో కోత పెడుతుంటారు యజమానులు. అలాంటి ఓ పనిపిల్లకు ఓ పాత్ర చేత చెహోవ్ ఇలా చెప్పిస్తాడు "పాఠం" కథలో "కానీ ఓ అమ్మాయి! మీరు వానపాముల్లాగా ఎలా బతకగలరీలోకంలో? పంజాలూ కొరడాలూ లేకపోయినా, కనీసం గోళ్ళన్నా ఉండాలా లేదా ఎదిరించడానికి?" అని.

లోకం దృష్టిలో సమాజానికి పట్టిన చీడ పురుగు వేశ్య! కానీ ఆ చీడ పురుగు ఎక్కణ్ణుంచి వచ్చిందని మాత్రం ఆలోచించదు. అందరి చేత దోచుకోబడటమే ఆ వేశ్యకు తెలిసిన విషయం. మగాళ్లు ఆమె మానాన్ని దోచుకుంటే, లోకం ఆమె గౌరవాన్ని దోచుకుంటుంది.

ధనవంతురాలు, కులీనురాలు అయిన ఓ భార్య ఆఖరికి ఆమె కష్టార్జితాన్ని కూడా దోచుకుంటే, దొంగలా నక్కిన అతను కనీసం ఆమెను ఓదార్చుదు సరికదా, ఆ ఇంటి కొచ్చేసరికి తన భార్య విలువ దిగజారిందని ఆ వేశ్యను ఛీత్కరించుకుంటాడు. చివరికావేశ్య తమలాంటి వాళ్ళ బతుకింతేనని వెక్కి వెక్కి ఏడ్వడం తప్ప ఏం చెయ్యగలదు? వంద సంవత్సరాల కిందటి కథ ఇదంటే నమ్మగలమా? ప్రతి మగాడూ భార్య ఉన్నప్పటికీ, పరాయి స్త్రీ సాంగత్యం పొందాలని ఉబలాటపడుతూనే వుంటాడు. వాడెంత భార్యా విధేయుడైనప్పటికీ కొందరు అందుకు ధైర్యంగా ప్రయత్నిస్తే, మరి కొందరికా ధైర్యం వుండదు. ఆ స్త్రీ తనంతట తానే వస్తే అందుకోవడానికి వెనకాడరు. ఈ రెండోకోవలోని వ్యక్తి పావెల్. అతని భార్య ఊహా ప్రేయసిలా ఉత్తరం రాస్తే, ఆమెను కలుసుకోవడానికి వెళ్ళి, మొహం వేళ్లాడేసుకొని తిరిగి వస్తాడు.

ముసలి మొగుడూ పడుచు పెళ్ళాం కథలు తెలుగు వారికి కొత్తేం కాదు. హాస్య రచయితలకు ఈ ఇతివృత్తం చేతినిండా పని కల్పిస్తుంది. అయితే ఒక్కో రచయితా ఒక్కో దృక్కోణంతో ఈ సమస్యని పరిశీలిస్తాడు. అయితే చెహోవ్ ప్రతి సమస్యనీ వివిధ కోణాల్లో దర్శించడం వల్ల ఈ కథలు పాఠకులకు నిత్య నూతనంగా కనబడటం విశేషం!. పడుచు పెళ్లాం, ముసలి మొగుడు కాంబినేషన్‌తో చక్కని హాస్య కథ

"పతివ్రత" రాశాడు చెహోవ్. ఈ బుల్లి కథలో ఓ ముసలి పోస్టు మాష్టరుగారి అందమైన పడుచు భార్య మరణిస్తుంది. ఆ ఊళ్ళోని కుర్రకారంతా ఆ భర్తను పరామర్శించడానికి వస్తారు. అప్పుడు వారికా మాష్టారు తన భార్య అందగత్తె మాత్రమేగాక, పతివ్రతని కూడా చెబుతూ, ఆ అందగత్తె అయిన తన భార్య వంక కుర్రాళ్లెవ్వరూ కన్నెత్తి చూడడానికి కూడా వీల్లేకుండా తాను పాటించిన ఓ చిట్కా బయట పెడతాడు. అదేమిటంటే ఆమె పోలీసు సూపరింటెండెంటు ఉంపుడుగత్తె అన్న పుకారు. ఇంత వరకూ కథ చెప్పడంలో ఏ ప్రత్యేకతా లేదు. ఏ కథకుడైనా చెబుతాడు. చెహోవ్ ప్రత్యేకత ఏమిటంటే ఆ తరువాత చెప్పిన ఆఖరు వాక్యమే. ఆమె సూపరింటెండెంటు ఉంపుడు గత్తె అనే విషయం ఉత్త పుకారే అని తెలిసిన ఆ కుర్రకారు ఒళ్ళు మండిపోయి, 'మళ్ళీ ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు? అనడిగారట' ఆశగా ఆ పోస్టు మాష్టారిని.

చివరిగా చెహోవ్ గురించి ఒక్కమాట! చెహోవ్ గొప్ప అసంతృప్తి రచయిత. అసంతృప్తి నుంచే జీవిత వాస్తవాలు వెలికి వస్తాయి కదా! పై పెచ్చు జీవితంలోని అన్ని పార్శ్వాలనూ ఈయన కథలు స్పృశించడం వల్ల ఒకే అంశంలోని పలు కోణాలు ఆవిష్కృతం అవుతాయి. అందువల్లనే ఈయన కథలన్నీ మన చుట్టూ జరుగుతుండేవే అనిపించినా, మనకు తెలియని ఓ కొత్త కోణం, ఓ జీవిత సత్యం ప్రతి కథలో మన ఆలోచనల్ని కదిలిస్తుంది. సరిగ్గా ఈ కారణం చేతనే ఆయన కథలు ఎప్పటికప్పుడు కొత్తగా అనిపించడం జీవితపు లోతుల్ని తరచి చూపించినట్లు అనిపించడం!

చెహోవ్ కథలు చదివిన ఎవరిపైనయినా వాటి ప్రభావం పడక తప్పదు. యువ రచయితలకయితే అవి పార్య గ్రంథాలతో సమానం. ఆయన రాసిన వెయ్యి కథల్లోనూ కేవలం 54 కథల్ని మాత్రమే సంకలనం ద్వారా పార్థసారథి తెలుగు వారికి అందించినా, రష్యన్, ఇంగ్లీష్ భాషలు తెలియని తెలుగు పాఠకులకు ఆ మాత్రం కథల్నయినా అందించి మహోపకారం చేశారు. ఈ సంకలనం చదవడం ద్వారా మిగిలిన చెహోవ్ కథలన్నీ ఎప్పుడు మన వారికి అందుబాటులోకి వస్తాయా అన్న ఆతృత కలగడం సహజం! ఆ బృహత్తర కార్యక్రమం ఏ ఒక్క అనువాదకుడి వల్లనో, సంస్థ వల్లనో సాధ్యమయ్యేది కాదు. తెలుగు అకాడమీ, రచయితల సంఘాలు వంటివి పూనుకుంటే ఆ ప్రయత్నం తప్పక నెరవేరుతుంది. ఆ రోజు తప్పక వస్తుందని ఆశిస్తూ తెలుగు పాఠకలోకం, సాహిత్యాభిమానులూ, రచయితలూ ఇప్పటికి ఈ కథల సంపుటిని ఆస్వాదించవచ్చు.

ముక్తవరం పార్థసారథి
చెహోవ్ కథలు
వెల:125/-
పేజీలు: 271,
ప్రతులకు:
నవోదయ బుక్‌హౌస్,
హైదరాబాద్.

❄







సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

కథా నిలయం
(శ్రీకాకుళం)

క్వానా పార్కర్

జరిగినకథ

"ఇళ్ల కప్పులకు రంధ్రాలు చేసి మరీ కాల్చాం" అన్నాడు క్వానా. తెల్లవాళ్లు, దగ్గరున్న తూటాలన్నీ కాల్చాక, దాడి చెయ్యాలన్నది ఇండియన్ల వ్యూహం. చాలాసేపు దాగుడు మూతలు కొనసాగాయి. ఎటాక్ కోసం ముందుకు లంఘించినప్పుడు క్వానా గుర్రానికి బుల్లెట్ తగిలి నేలకూలింది. క్వానా భుజానికి మరో బుల్లెట్ తగిలి నేల కూలింది. క్వానా భుజానికి మరో ములెట్ తగిలింది. ఆరోజు ప్రాణం పోవాల్సిందే గాని, ఒక ప్లమ్ పొద వెనక నక్కి, సాయంత్రం వరకు సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాడు.

అమెరికన్ ధేగ

(43వ భాగం)

మధ్యాహ్నానికి పోరాటమాగింది. ఇండియన్లు వెనక్కు తగ్గారు. ప్రాణ నష్టం బాగానే జరిగింది. పదిహేను మంది మరణించగా, మరెందరో గాయపడ్డారు. ఇండియన్లు తమ కోపమంతా ఇసాటామ్ మీద చూపించారు. బుల్లెట్లు తగలవన్నాడు. విజయం తమనే వరిస్తుందన్నాడు. మరింత బీభత్సమెందుకు జరిగింది? ఒక షెయెనీ యువకుడు ఇసాటామ్‌ని బెత్తంతో బాదాడు. ఇది చూసి మరి కొందరు అదే పని చేయబోయారు. క్వానా అడ్డుకుని అందర్నీ చీవాట్లు పెట్టాడు "జరిగింది చాలు. దొంగ వాగ్దానాలు వద్దు". ఆనాటితో క్వానా పార్కర్‌కు మంత్రగాళ్ల మీద నమ్మకం పోయింది.

అడోబ్‌వాల్స్ మీద దాడి విఫలమైన తర్వాత, లోన్‌వూల్ఫ్, సాటాంటా తమ అనుచరులను కియోవాల సన్‌డాన్స్ కోసం రెడ్ రివర్ ఉత్తర ముఖద్వారానికి తీసుకెళ్లారు. కొమాంచీ, షెయోనీలను కూడా ఈ సంబరాలకు ఆహ్వానించారు. ఈ డాన్సుకు ముఖ్య కారణం సాటాంటా, బిగ్ ట్రీల విడుదల, పునరాగమనం! "ఒకవైపు బఫెలో మందలు కనుమరుగవుతుంటే, సంబరాలు చేసుకుంటారా?" అంటూ క్వాహడీలు దెప్పిపొడిచారు. "మొదలు యుద్ధం చేసి తెల్లవాళ్లను తరిమేద్దాం. తరువాత డాన్సులు" అదీ వాళ్ల నినాదం.

కాని, కికింగ్ బర్డ్‌కు పోరాటమంటే విరక్తి. భయం. డాన్సు తర్వాత రిజర్వేషన్‌కు వెళ్ళిపోదామన్నాడు. తమ మనుగడకోసమైనా, క్వాహడీలతో చేతులు కలిపి యుద్ధం చెయ్యక తప్పదన్నాడు లోన్ వూల్ఫ్.

అయితే, ఈసారి, సాటాంటా వెంట రాలేదు. "చేసిన పోరాటం చాలు. ఇక ప్రశాంతంగా బతుకుతా"నంటూ ఫోర్ట్‌సిల్‌కు ప్రయాణమయ్యాడు. దారిలో విచిటా రిజర్వేషన్ వద్ద ఆగి, మొక్క జొన్నలు పండించుకుంటున్న ఇండియన్లతో కొంత వస్తు మార్పిడి వ్యాపారం చేసుకుని పోదామని రెయినీ మౌంటెన్‌క్రీక్ దిశగా కదిలాడు. వేసవి వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. ఫోర్ట్‌సిల్‌కు రెండు రోజులు ఆలస్యంగా చేరితే కొంపలేం మునిగిపోవు. మళ్ళీ అవే రేషన్లు, అవే రోల్‌కాల్స్.

అయితే, మైదాన ప్రాంత వాసులకు వేసవి గడ్డు కాలమే. మండే ఎండలకు నేల బీటలు వారింది. నీళ్లు ఇంకిపోయాయి. మిడతల దండు దాడి చేసి వచ్చిన కొద్ది పంటనూ పాశనం చేసింది. కొద్ది సంవత్సరాల క్రితం ఇలాంటి క్షామం వస్తే మరెన్ని మిలియన్ల దున్నలు మరణించేవో గాని, ఆ విశాలమైన మైదానాల నిండా ఎక్కడ చూసినా పశువుల అస్తిపంజరాలే. వాటి గిట్టల చప్పుళ్లకు బదులు, ఆకలి దప్పులతో అవి చేసిన మరణరోదనలతో నిండి పోయింది ప్రెయిరీ. పశువుల్లేవు గనక బఫెలో హంటర్స్ కూడా నిష్క్రమించారు. కొమాంచీలు, కియోవాలు, షెయెనీలు, అరపాహోలు దున్న కోసం వెదికి, ఆహారం దొరక్క, ఆకలితో అలమటిస్తూ, అనివార్యంగా రిజర్వేషన్‌ల బాట పట్టారు.

అయితే, అక్కడా పరిస్థితులు సానుకూలంగా లేవు. సైన్యాధికారులకూ, ఇండియన్ బ్యూరో అధికారులకూ మధ్య మాటల యుద్ధం మొదలైంది. హెడ్ క్వార్టర్స్ నుండి ఆహారపు సప్లైలు ఆగిపోయాయి. రిజర్వేషన్ రూల్సును అతిక్రమించిన ఇండియన్లకు రేషన్లు ఇవ్వకూడదన్నారు కొందరు ఏజెంట్లు. ఆకలి మంటలు తిరుగుబాట్లను రగిలించాయి. సైనికులకూ, ఇండియన్లకూ మధ్య రోజూ తగాదాలే. ఇరువైపులా జరుగుతున్న ప్రాణనష్టాన్ని ఎవరూ అరికట్టలేకపోయారు. జూలై చివరినాటికి ఫోర్ట్‌సిల్ నుండి సగం ఇండియన్ జనాభా ఖాళీ అయింది. తిండి లేకపోతే ఎన్నాళ్లుంటారు? 'బఫెలో'లే ఆహారంగా బతికిన చివరి ఇండియన్ తెగలు పాలో డ్యూరో కాన్యన్ వద్ద ప్లేస్ ఆఫ్ చైనా బెర్రీ ట్రీస్‌కు తమ మకాం మార్చుకున్నాయి.

దూరం నుండి చూస్తే పాలో డ్యూరో కనిపించదు. బాగా పెరిగిన గడ్డి దుబ్బులు, చెట్ల మధ్య ప్రకృతి ఒడిలో దాగినట్టుంటుంది. మైదానాలన్నీ ఎండినా ఇక్కడ మాత్రం ఏ కాలవలోనూ నీరు ఇంకిపోలేదు. పశువుల మందలు తప్ప మనుషులు రావటానికి సరైన దారిలేదు. పదహారవ శతాబ్దంలో కారొనాడో వచ్చినట్టుగా సాక్ష్యాలున్నాయిగాని ఆ తర్వాత మరే తెల్లవారూ అంత ధైర్యం చెయ్యలేదు.

1874 వసంతకాలంలో, ఇండియన్లకూ, పశువులకూ ఆశ్రయమిచ్చింది పాలోడ్యూరో. బఫెలోలే ఆహారంగా బతికే మనుషులు వాటిని చాలా జాగ్రత్తగా, అవసరానికి సరిపడినన్ని మాత్రమే చంపుతారు. మాంసాన్ని వృధా చెయ్యరు. మిగిలితే ఎండ బెట్టుకొని తింటారు. ఎముకలలోని మూలుగునూ, కొవ్వు, చర్మాలను ఇతర అవసరాల కోసం జాగ్రత్తగా దాచుకుంటారు (నరాలను దారంగా, కొమ్ములను, ఎముకలను, స్పూన్లుగా వెంట్రుకలను పేని తాళ్ళుగా, బెల్టులుగా, చర్మాన్ని గుడారాల కప్పుగా, కప్పుకోవటానికి, తొడుక్కోవటానికీ, పాదరక్షలుగానూ వాడుతారు).

"ఎల్లో లీవ్స్ మూన్" (రుతువు)కు ముందు ఈ

కాన్యన్ అంతటా కియోవా, కొమాంచీ షెయెనీల గుడారాలే. ఆహారం సమృద్ధిగా దొరికేది. చలిలో వేటకు వెళ్ళాల్సిన అవసరమే వుండేది కాదు. మంటల చుట్టూ కూర్చుని, ఆడుతూ, పాడుతూ విందులు, వినోదాలలో గడపటం వాళ్ల అలవాటు. పచ్చిగడ్డి తిని బలిసిన రెండు వేల గుర్రాలు వాళ్ల సంపద. స్త్రీలు, పిల్లలూ నిర్భయంగా అంతటా సంచరించేవారు. తరతరాలుగా మేం ఇక్కడ ఇలాగే బతికాం" అంటూ జ్ఞాపకం చేసుకున్నాడు క్వానా. లోన్ వూల్ఫ్‌కూ, ఇతర కియోవాలకూ ఇది కొత్త జీవితం.

తెల్లవాళ్ళ రేషన్ల మీద ఆధారపడి రిజర్వేషన్‌లలో బతకాల్సిన "ఆటవికులు" ప్రకృతి సిద్ధమైన ఆహారం తింటూ, స్వేచ్ఛగా తిరగటం అధికారులకు నచ్చలేదు. క్వాహడీలూ, ఇతర తెగలూ చేరిన వెంటనే వాళ్ళను వెంటాడి పట్టుకోవాలని జనరల్ షెర్మాన్ ఆజ్ఞలు జారీ చేశాడు. సెప్టెంబర్‌లో, అయిదు సైనికదళాలు కాన్యన్‌ను చుట్టు ముట్టాయి. ఫోర్ట్ డాడ్జ్ నుండి బేర్ కోట్ నెల్సన్ మైల్స్, ఫోర్ట్ కాంచో నుండి త్రీ ఫింగర్స్ మెకెంజీ, న్యూమెక్సికోలోని ఫోర్ట్ బాస్కాం నుండి మేజర్ విలియం ప్రెస్, సిల్, రిచర్డ్ సన్‌ల నుండి జాన్ దేవిడ్‌సన్, జార్జి బెల్‌ల నాయకత్వంలో, రైఫిళ్లు, ఇతర అత్యాధునిక ఆయుధాలతో వేలాది సైనికులు ఇండియన్ ప్రాంతాన్ని దిగ్బంధం చేశారు. వీళ్ళు - ఇన్ని వేల "వీరాధి వీరులు", ఆత్మ రక్షణ కోసమూ, బఫెలో రక్షణ కోసమూ దుర్గమారణ్యాలలో తల దాచుకున్న కొన్ని వందల ఇండియన్ల కోసం! తమను ధిక్కరించి, స్వేచ్ఛగా బతకుతామంటే నాగరికుల కెంత అవమానం!

కొందరు కిరాయి (అమ్ముడుపోయిన) ఇండియన్‌ల సహాయంతో, మెకెంజీ, తన అశ్వికదళంతో సెప్టెంబర్ 26నాడు పాలో ద్యూరో గ్రామంలో ప్రవేశించాడు. ఈ దుండగుల ఘాతుకాల్ని మొదట ఎదుర్కొన్నది లోన్‌వూల్ఫ్. ఇతర కియోవాలు చాలాసేపు పోరాడి, స్త్రీలు, పిల్లలతో, తెరగా ఎగసిన తుపాకీ పొగమాటున తప్పించుకున్నారు. గ్రామంలోని 'టెపీ'లనూ, ఆహార నిల్వలనూ ధ్వంసం చేశారు సైనికులు. ఆ తర్వాత వెయ్యి గుర్రాలను పట్టుకుని, మెకెంజీ ఆదేశం ప్రకారం, టూలె వ్యాలీకి తరలించారు. అప్పటికీ కసిదీరక వాటిని నరికేశారు. ఆ కళేబరాల మీద వాలిన కీటకాల మోతతో కాన్యన్ ప్రతిధ్వనించింది.

చెల్లా చెదురైన ఇండియన్లు, కూడు గుడ్డా గూడు వెదుక్కుంటూ మైదానాలలో రోజుల తరబడి సంచరించారు. అందరూ అనాథలే. వీళ్లను మట్టుబెట్టటానికి సైనికులకింతకన్నా మంచి అవకాశం రాదు. కనిపించిన వాళ్ళను కనిపించినట్టే పిట్టల్లా కాల్చివేశారు. యువకులు, వృద్ధులు, జబ్బు పడినవాళ్ళు, స్త్రీలు, పిల్లలు- ఎవరూ మిగల్లేదు.

దాడిలో 252 మంది కియోవాలతో లోన్‌వూల్ఫ్ తప్పించుకోగలిగాడు. సైనికుల కళ్ళుగప్పటం అసాధ్యమని తెలిసిపోయింది. 1875, ఫిబ్రవరి 25 నాడు ఫోర్ట్ సిల్‌కు వచ్చి లొంగిపోయాడు. మరో మూడు నెలల తర్వాత క్వాహడీ బృందంతో క్వానా కూడా చేరుకున్నాడు.

రిజర్వేషన్‌లో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితిని ఆసరాగా తీసుకొని, పెరోల్ మీదున్న సాటాంటా, బిగ్‌ట్రీలు కూడా పారిపోయారు. కాని ఎక్కువ

కికింగ్ బర్డ్

"అయాం సారీ . మీ మొండితనమే మిమ్మల్నీదశకు తెచ్చింది. మిమ్మల్ని శిక్షిస్తున్నది నేను కాదు. అమెరికన్ ప్రభుత్వం. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోండి. మీ విడుదల కోసం శాయశక్తులా ప్రయత్నిస్తాను" అంటూ ధైర్యం చెప్పాడు.

"బాగుంది తెల్లవాళ్ళ మోచేతి నీళ్ళు తాగి నువ్వు స్వేచ్ఛగా తిరుగు. నీలాంటి తొత్తుకొడుకులకు రోజులు దగ్గరపడ్డాయి. కాలం మూడింది" అంటూ ఛీత్కారంగా మాట్లాడాడు మామంటి ది స్కైవాకర్.

దూరం పరిగెత్తలేక షెయెనీ ఏజెన్సీ వద్ద అధికారులకు ఆత్మ సమర్పణ చేసుకున్నారు. ఈ సారి వాళ్ళను ఇనుప గొలుసులతో బంధించి గార్డ్ హౌజ్‌కు తరలించారు.

ఫోర్ట్‌సిల్‌లో, ఇండియన్లను నిరాయుధులను చేసి, పశువుల కొట్టాలలో పశువులతో పాటు కట్టేశారు. వీళ్ళకుండే ఆస్తే అతి స్వల్పం. తోళ్ళా, విల్లంబులు వగైరా వాటిని కుప్పగా పోసి తగల బెట్టారు సైనికులు. మిగిలిన గుర్రాలను ప్రెయిరీలలో కాల్చేశారు. ఇండియన్లు తప్పించుకోవటంలో సహాయం చేశారనుకున్న చోటా నాయకులకు కూడా ఏకాంత కారాగారవాసం విధించి చిన్న చిన్న 'సెల్'లో బంధించారు. 'జూ'లో జంతువులకేసినట్టు, ఓ రంధ్రం గుండా విసిరిన పచ్చిమాంసం ముక్కలే వాళ్ళకాహారం.

వాషింగ్టన్‌లో కూర్చున్న షెర్మాన్, ఖైదీల విచారణకాదేశించాడు. సాటాంటా, బిగ్‌ట్రీలకు క్షమాభిక్ష ప్రసాదించమని రెకమెండ్ చేశాడు హావర్ద్. షెర్మాన్‌కు బిగ్‌ట్రీ మీద కోపం లేదు. అలజడికి మూలకారణమనుకున్నా సాటాంటాను మాత్రం టెక్సాస్ పెనిటెన్షియరీకి పంపారు.

బందీలుగావున్న వాళ్ళందరూ నేరస్తులు కారు. ఎవరి మీద విచారణ జరపాలో, ఎవర్ని శిక్షించాలో తెలియదు. తనతో ఇరవై ఆరు మందిని తీసుకొని ఫ్లోరిడాలో ఫోర్ట్ మారియన్‌కు వెళ్లమని కికింగ్‌బర్డ్‌ను ఆదేశించారు అధికారులు.

ఇష్టపూర్వకంగా జైలుకు రమ్మని అడగటం ఎలా? లోన్‌వూల్ఫ్, వుమన్స్ హార్ట్, నైట్ హార్స్, మామంటీ ది స్కైవాకర్‌లు టెక్సాస్ దాడిలో పాల్గొన్నారు. వాళ్ళకు శిక్ష తప్పదు. నేరం చెయ్యని వాళ్లకు శిక్ష పడకూడదనే అతడి అభిప్రాయం. కాని సాటి ఇండియన్లను జైలుకు తరలించినవాడు తెగవాళ్లకు శత్రువు కాక తప్పదు.

"నడుస్తున్నప్పుడు కాలికి తగిలే రాయిలాంటి వాణ్ణి నేను. ఎవరైనా, కోపంతో తీసి పక్కకు విసిరేస్తారు" అంటూ థామస్ బాటేతో తన బాధ వెళ్లబోసుకున్నాడు కికింగ్ బర్డ్.

ఫ్లోరిడాకు తరలించటానికి, బందీలకు సంకెళ్ళువేసి వ్యాగన్‌లోకి ఎక్కిస్తున్నప్పుడు కికింగ్‌బర్డ్ వాళ్లకు వీడ్కోలుగా

"అయాం సారీ.. మీ మొండితనమే మిమ్మల్నీదశకు తెచ్చింది. మిమ్మల్ని శిక్షిస్తున్నది నేను కాదు. అమెరికన్ ప్రభుత్వం. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోండి. మీ విడుదల కోసం శాయశక్తులా ప్రయత్నిస్తాను" అంటూ ధైర్యం చెప్పాడు.

"బాగుంది తెల్లవాళ్ళ మోచేతి నీళ్ళు తాగి నువ్వు స్వేచ్ఛగా తిరుగు. నీలాంటి తొత్తుకొడుకులకు రోజులు దగ్గరపడ్డాయి. కాలం మూడింది" అంటూ ఛీత్కారంగా మాట్లాడాడు మామంటి ది స్కైవాకర్.

ఈ శాప ఫలితమో, మరే కారణమోగాని, రెండు రోజుల తర్వాత, తన గుడారంలో కాఫీ తాగుతూ మిస్టీరియస్‌గా మరణించాడు కికింగ్‌బర్డ్.

మరో మూడు నెలల తర్వాత, ఈ మరణ వార్త తెలిసి మామంటి కూడా అకస్మాత్తుగా ప్రాణాలు వదిలాడు. ఇదంతా కికింగ్‌బర్డ్ మంత్రశక్తే అన్నారు ఇండియన్లు.

"తన మరణాన్ని తానే శాసించుకుని, సాటి మనిషిని కూడా చంపగల మహిమ వుందతనికి".

మరో మూడు సంవత్సరాల తర్వాత, జైలు జీవితాన్ని భరించలేక (టెక్సాస్‌లో) మేడ కిటికీలో నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు సాటాంటా. అదే సంవత్సరం, మలేరియా జ్వరంతో బాధపడుతున్న లోన్‌వూల్ఫ్‌ను ఫోర్ట్‌సిల్‌కు తిరిగి రావటానికి అనుమతించారు. కాని అతడు కూడా ఏడాది తిరక్కుండానే మరణించాడు.

గొప్ప నాయకులెవరూ మిగల్లేదు. కియోవాలు, కొమాంచీల ప్రాభవం దిగజారింది. ప్రాణాలొడ్డి వాళ్ళు రక్షించాలనుకున్న 'బఫెలో' అంతరించింది. కేవలం, పదేళ్ల కాలంలో జరిగిన పరిణామాలివి.

బ్లాక్‌హిల్స్ యుద్ధం

"ఇండియన్ ప్రాంతాల్లో ఇతరులెవరూ తాత్కాలిక లేదా స్థిర నివాసం ఏర్పరుచుకోవటం చట్ట విరుద్ధం. ఇండియన్ల అనుమతితో మాత్రమే తెల్లవాళ్ళు ఇక్కడ ప్రయాణించారు"

- 1868లో జరిగిన ఒప్పందంలోని షరతు.

"బ్లాక్‌హిల్స్ మా సంపద. తెల్లవాళ్లక్కడ తిరగటానికి వీల్లేదు. యుద్ధం చెసైనా సరే మా భూమిని రక్షించుకుంటాం"

- టటాంకా యోటంకా (సిట్టింగ్ బుల్)

"మనుషులు తిరుగాడే భూమిని ఎలా అమ్ముకుంటారు"

టాషంకా విట్కో (క్రేజీ హార్స్)

"ఈగలు గుడ్లు పెట్టినట్టుగా తెల్లవాళ్లు బ్లాక్ హిల్స్‌లో వ్యాపిస్తున్నారు. దొంగల సర్దార్ (జనరల్ కస్టర్) బ్లాక్‌హిల్స్ గుండా రోడ్డు వేశాడు. మాకు జరిగిన ఈ నష్టానికి గ్రేట్ ఫాదర్ నుండి పరిహారం డిమాండ్ చేస్తున్నాం"

- బాపిస్ట్ గుడ్

ఇంకా వుంది....



హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

చదివినా ... పరీక్ష రాయలేకపోతున్నా...



నా వయసు 15 సంవత్సరాలు. టెన్త్ చదువుతున్నాను. చదివింది చదివినట్టుగా పరీక్ష రాయలేకపోతున్నాను. నాకు 500 మార్కులు తెచ్చుకోవాలని ఉంది. ఇంట్లో ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. రైటింగ్ ఇంప్రూవ్ అవ్వాలంటే ఏమి చేయాలి? చదివింది అస్సలు గుర్తుకు ఉండడం లేదు. ఉదయం 6-30 గంటల నుండి రాత్రి 5-30 వరకు స్కూల్లోనే ఉంటున్నాను. దయచేసి సలహా ఇవ్వగలరు?

రామేశ్వరి, వినుకొండ.

'నేను రాయలేకపోతున్నాను. చదవలేక పోతున్నాను. గుర్తుకు ఉండడం లేదు' అని అనుకోవద్దు. ఆలోచనలు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. వాటిని పట్టించుకోకుండా నీ చదువు మీద దృష్టి పెట్టు. నీవు బాగా చదివిన విషయాలను పునఃశ్చరణ చేసుకోకపోవడం వల్ల మర్చిపోతావు. తరుచుగా నీవు చదివిన విషయాలను మననం చేసుకుంటూ వుండు. పరీక్షలు జరుగుతాయనగానే ముందు రోజు రాత్రితోనే చదువు పూర్తయ్యేలా చేసుకో. ఎట్టి పరిస్థితిలోనూ పరీక్షరోజు ఉదయం చదవవద్దు. అలా చేయడం వల్ల ఎటువంటి ఆందోళన లేకుండా నీవు చదివిన విషయాలన్నిటిని హాయిగా పరీక్షల్లో రాయగలుగుతావు. నువ్వు చదువుని, పరీక్షలను ఇష్టపడితే నువ్వనుకున్న విధంగా మార్కులు తెచ్చుకోగలుగుతావు. ప్రతి రోజు ఒకే సమయానికి నిద్రపోవటం అలవాటు చేసుకోండి. కాపీ రైటింగ్ పుస్తకం రోజు రాయడం ప్రాక్టీసు చేయండి. అప్పుడు మీ రైటింగ్ చక్కగా ఉంటుంది.

ఇంగ్లీషులో మాట్లాడాలని వుంది



నేను ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నాకు ఇంగ్లీష్ నేర్చుకొని మాట్లాడాలనే కోరిక ఉంది. కానీ చదువుదామని పోయే సరికి దానిపై ఇష్టం కల్గడం లేదు. నేను ఇంగ్లీష్ నేర్చుకొని మాట్లాడాలంటే ఏం చెయ్యాలి?

వంశీ, గుంటూరు.

మీరు ఇంగ్లీష్ ఎందుకు నేర్చుకోవాలనుకుంటున్నారో మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీకు నేర్చుకోవడం ఇష్టంలేక పోయినా నేర్చుకోలేరు. ఇంగ్లీష్ నేర్చుకోవటం ఈ రోజుల్లో చాలా అవసరం. ఇతర దేశాలకు వెళ్లాలన్నా, మంచి ఉద్యోగం సంపాదించాలన్నా, చక్కని కమ్యూనికేషన్ ఉండాలన్నా ఇంగ్లీష్ అవసరం. ప్రతి రోజు ఇంగ్లీష్ పేపర్ చదవటం, ఇంగ్లీష్ న్యూస్ వినడం, మీకు వచ్చిన ప్రతి మాట మాట్లాడడం చేయండి. అలా ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం ప్రాక్టీసు చేస్తే అందరికన్నా మీరు చక్కగా ఇంగ్లీష్ మాట్లాడగలుగుతారు. ముందు మీ మనసుకు ఇంగ్లీష్ అవసరాన్ని తెలియజేయండి. అప్పుడు త్వరగా నేర్చుకోగలుగుతారు.

ప్రేమను మరిచి చదువే లోకం కావాలంటే...

నాకొక స్నేహితుడు ఉన్నాడు. ఇద్దరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారింది. అతను, నాతో స్నేహంగా వున్నప్పుడే నాకు చాలా హ్యాపీగా ఉంది. ఎప్పుడైతే ప్రేమ అని పేరు పెట్టామో, అప్పటి నుండి నాతో సరిగ్గా మాట్లాడటం లేదు. చచ్చిపోవాలనిపిస్తుంది. నేను బాగా చదువుతున్నాను. క్లాసులో నాది 'ఎ' గ్రేడ్, నేను 10వ తరగతి చదువుతున్నాను. కాని నాకు చదువుకోవాలని ఉంది. ఎలాగైనా అతన్ని మర్చిపోయి, మంచిగా చదువుకొనేటట్లు సలహా ఇవ్వండి.

ఓ సోదరి, కరీంనగర్.

అతనిని మర్చిపోయి మంచిగా చదువుకోవాలనుకోవడం చాలా మంచిది. అతను మీతో స్నేహంగానే ఉండాలనుకుంటున్నాడు. కాబట్టే ప్రేమ అనగానే మీ నుంచి దూరంగానే ఉంటున్నాడు. అతను నిజాయితీగా మీ నుంచి తప్పుకుంటున్నాడంటే అభినందించవలసిన విషయం. మీరు మీ కుటుంబ వ్యక్తులను ప్రేమించండి. మీ చదువును ప్రేమించండి. ఎన్ని ఆలోచనలు వచ్చినా చదువు మీద దృష్టి పెట్టి చదవటం, రాయడం చేయండి. కొన్ని రోజులకు మైండ్ అనవసరపు ఆలోచనలు తొలగించి మంచిగా చదువుకునే విధంగా చేస్తుంది. చదువుకునే వయసులో చదువుకుంటే మీరు భవిష్యత్తులో గొప్ప వ్యక్తి కాగలరు.

నటన ముందు అందం గుర్తుకురాదు



వర్మ

18 ఏళ్ళ క్రితం 'శివ' చిత్రంతో తెలుగు సినిమా నడకనూ, నడతనూ మార్చిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. తన దర్శకత్వంతో బాలీవుడ్ శైలినీ మార్చేశాడు. 'ఆర్.జి.వి 'ఫ్యాక్టరీ' పెట్టి పలు చిత్రాలు నిర్మించి యువ ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. ఈక్రమంలో జయాపజయాలు చవిచూస్తున్నారు. 'షోలే'కు రీమేక్‌గా తీసిన 'ఆగ్' పలు విమర్శలకు దారి తీసింది. అపజయాన్ని సక్సెస్ మంత్రంతో తిప్పికొట్టే పనిలో ఉన్నారు. ప్రస్తుతం 'సర్కార్' సీక్వెల్‌గా 'సర్కార్ రాజ్'ను తెరకెక్కించారు. ఇందులో బచ్చన్ ఫ్యామిలీ (అమితాబ్, అభిషేక్, ఐశ్వర్యారాయ్) నటించారు. 'ఐశ్వర్యారాయ్ అందగత్తె. కానీ ఆమె ఇందులో ప్రదర్శించిన నటన ముందు ఆ విషయం గుర్తుకురాదు. అనిత క్యారెక్టర్‌ను పూర్తిగా అర్థం చేసుకుని అద్భుతమైన పెర్‌ఫార్మెన్స్ కనబరిచింది. ఆశ్చర్యపోవడం నా వంతయింది' అని వర్మ అంటున్నారు. 'సర్కార్ రాజ్' గురించి మరిన్ని విశేషాలు...

'సర్కార్ రాజ్'ను ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు తీసుకొస్తున్నారు?

సినిమా విడుదల ఆలస్యమవుతుందని వస్తున్న వార్తల్లో నిజం లేదు. క్రికెట్ మ్యాచ్‌లు, పరీక్షలు దృష్టిలో పెట్టుకుని మే చివరివారంలోగానీ, జూన్ మొదటివారంలోగానీ విడుదల చేస్తాం. ఇప్పటివరకూ రీ షూట్ చేయలేదు. అసలు ఆ అవసరమే రాలేదు. సినిమా బాగా వచ్చింది. అమితాబ్, అభిషేక్, ఐశ్వర్యారాయ్, నేను చాలా హ్యాపీగా ఉన్నాం.

బచ్చన్ ఫ్యామిలీ నటించడంతో సినిమా గురించి ఆసక్తి నెలకొందని భావిస్తారా?

బచ్చన్స్ వంటి స్టార్స్ చిత్రంలో ఉన్నప్పుడు ప్రేక్షకులు దీని గురించి మాట్లాడుకోవడం సహజం. కానీ కొందరు చెడుగా మాట్లాడుతున్నారు. నెగటివ్‌గా రాస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు నడుస్తున్నాయి.

'సర్కార్' బాటలో 'సర్కార్ రాజ్' నడుస్తాదా?

దానికి దీనికీ పోలికే లేదు. 'సర్కార్ రాజ్'తో తొలిసారి సోషియో పొలిటికల్ ఇతివృత్తాన్ని తెరకెక్కిస్తున్నాను. 'సర్కార్' కథ ముగింపు దగ్గర నుంచి 'సర్కార్ రాజ్' మొదలుకాదు. పూర్వ చిత్రానికిది సీక్వెల్ అని ఖచ్చితంగా చెప్పలేను.

మరి 'సర్కార్ రాజ్'ను ఎలా అర్థం చేసుకోవచ్చు?

గత చిత్రం కంటే మెరుగైన కథనం ఉంటుంది. సీక్వెల్‌లా కాకుండా కొత్త చిత్రాన్ని చూసిన అనుభూతి కలుగుతుంది.

నర్మదా డామ్ ప్రాజెక్ట్‌కూ 'సర్కార్ రాజ్'కూ సంబంధం ఏమన్నా ఉందా?

అస్సలు లేదు. అంతర్గతంగా రాజకీయ వాతావరణం కనిపిస్తుంది. అలాగని పొలిటికల్ చిత్రం కాదు. మానవ సంబంధాలకు, తండ్రీకొడుకుల అనుబంధానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచే చిత్రమిది.

ఐశ్వర్యా రాయ్ క్యారెక్టర్ గురించి...

జాలిలేని మహిళా వ్యాపారవేత్తగా నటించింది. తన కంపెనీ ఉన్నత స్థితికి అహర్నిశలూ శ్రమిస్తుంది. ప్రజల డబ్బుతో తన సంస్థను అభివృద్ధి చేస్తుంది. సర్కార్ పాత్రలో అమితాబ్ ప్రజల సంక్షేమం కోసం తన ఆస్తిపాస్తులను ఖర్చు పెడతాడు. అభిషేక్ ప్రజల కోసం కష్టపడతాడు. స్వభావాలు, సిద్ధాంతాల రీత్యా అభిషేక్, ఐశ్వర్య పాత్రలు విరుద్ధంగా ఉంటాయి. భావాల సంఘర్షణ ఉన్నా... వీరిద్దరిలో ఆసక్తికరమైన సంబంధం నెలకొంటుంది.

ఈ పాత్రకు ఆమెనే ఎందుకు ఎంచుకున్నారు?

అనిత పాత్రకు స్ట్రాంగ్ హీరోయిన్ కావాలి. ఐశ్వర్యారాయ్ అందగత్తె. కానీ ఆమె ప్రదర్శించిన నటన ముందు ఆ విషయం గుర్తుకురాదు. అనిత క్యారెక్టర్‌ను పూర్తిగా అర్థం చేసుకుని అద్భుతమైన పెర్‌ఫార్మెన్స్ కనబరిచింది. ఆశ్చర్యపోవడం నా వంతయింది.

ఐశ్వర్యారాయ్ గతంలో ఇలాంటి నటన ప్రదర్శించలేదంటారా!

కెమెరా వెనకాల ఉండి ఆమె నటనను చూశాను. అనిత పాత్రకు న్యాయం చేకూర్చడం చాలా కష్టం. నాటకీయ పరిణామాలతో, కన్నీటితో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడం పెద్ద కష్టం కాదు. కానీ ఇలాంటి పాత్రతో మెప్పించడం కష్టమే.

ఒకే ఫ్యామిలీకి చెందిన వారితో విరుద్ధ భావాలుగల పాత్రలు చేయించారు. ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారంటారు?

ప్రేక్షకుడు థియేటర్‌లోకి అడుగుపెట్టిన మరుక్షణమే బచ్చన్స్ ఫ్యామిలీ గురించి, ఐశ్వర్య నిజ జీవితం గురించి మర్చిపోయి సినిమాలో లీనమౌతాడు.

❋

నీడ చూసి చెప్పగలరా?

హాయ్! పిడుగులూ! ఇదిగో ఇక్కడ మూడు జంతువుల నీడలు వున్నాయి. మీరేం చేయాలంటే వాటిని బాగా పరిశీలనగా చూసి ... అవి ఏ జంతువులవో చెప్పాలి. ఓకేగా.

(జవాబు: ఎలుగు బంటి పిల్ల, పులి, బాతు)



ఎక్కడున్నాయబ్బా...



ఇదిగో చిన్నారులూ... గోపీ అనే అల్లరి పిల్లాడు ఒక ముఖ్యమై కాగితాన్ని ముక్కల ముక్కలుగా చింపేశా అసలు తమాషా ఏంటంటే... అందుల వున్న ముక్కలు రెంటి తీసుకుని అచ్చు అలాంటివే మరో రెండు తయారుచేశా అయితే ఆ రెండూ ఎక్కడున్నాయో కనుక్కోమంటున్నాడు మరి బయట వున ముక్కలను చూశారు వెతకడం మొదలెట్టండీ...

కవల విదూషకులెవరోచ్

హాయ్! ఇక్కడ ఐదుగురు విదూషకులు వున్నారుకదా. వాళ్లల్లో ఇద్దరు మాత్రం కవలలు. ఇంతకీ వారెవరో కనుక్కోవాల్సింది మీరేనోచ్.



ఆన్సర్: రెండు, మూడు

కాగితం చెట్టు చేసేద్దాం





నేస్త

మీ ఎ కాగిత చెట్టు చే డం వచ్చా! దరు వచ్చని, కొందరు రాదని కొందరు అనుమాన తల ఊపుతున్నారు. ఇవాళ మీకు మేం చెప్తాం నేర్చుకోండే.

ముందు పల్చపాటి కా తీసుకొని బొమ్మలో చూపించి చుట్టండి. దీనిని మూడు సమాన భా చేస్తూ గుర్తులు పెట్టుకోండి. రెండు వం వదిలిపెట్టి మిగతా కాగితాన్ని కత్తెరతో చీలిక కత్తిరించండి. తర్వాత కత్తిరించిన కాగితాలవైపు మ పీచులు పట్టుకుని నిదానంగా బయటకు లాగండి. అంతే కా చెట్టు మీ చేతుల్లో వుంటుంది. మరి చేసి చూస్తారుగా.

దారి కనిపెట్టండి చూద్దాం



నింపండి గబగబా...

ఖాళీ గళ్లల్లో పక్కన వున్న బొమ్మల పేర్లను ఇంగ్లీషులో నింపాలి. మీకు తెలీక పోతే పెద్దవాళ్లనడగండి. అప్పటికీ తెలీకపోతే మా సమాధానం చూడండే. ఎన్ని సరిగ్గా రాస్తే అన్ని మార్కులు వచ్చినట్టు. ఇందులో చీటింగ్ చేయకూడదే.

సమాధానం: 1. baloon, 2. nail, 3. lion, 4. orange 5. umbrella, 6. moon, 7. apple.

పది పళ్లు ఎక్కడ దాగాయో...

నేస్తాలూ!మీకు పళ్లన్నా...పళ్ల రసమన్నా భలే ఇష్టంకదా. అందుకే ఈ వారం ఈ పజిల్ తీసుకొచ్చాం. ఈ చెట్టులో పది రకాల పళ్లున్నాయి. మీరు చిటికెలో వాటిని కనిపెట్టాలి. ఓకే...1..2..3.





మేం చెప్పిన రంగులద్దండే

ఇక్కడ ఒక చక్కటి దృశ్యం వుంది. కాకపోతే గజిబిజిగా అనిపిస్తుందిప్పడు. మేం చెప్పిన విధంగా ఒక్కో అంకె వున్న దగ్గర ఒక్కో రంగు అద్దితే మాత్రం చక్కటి బొమ్మ మీకు కనిపిస్తుంది. మరి మీరు అద్దాల్సిన రంగులేంటంటే... 1-పసుపు, 2-నలుపు, 3-నారింజ, 4-ఎరుపు, 5-ఆకుపచ్చ, 6-నీలం.

అట్టమీది కథ

పండు పండూ అరటి పండూ

ఎంకెఆర్



అరటి పండా తొక్కలో పండు అంటున్నారు కదూ నన్ను? నిజమే కదా నేనుండేది తొక్క వెనుకే కదా... ఏం చేస్తాం... నేనంటే కొందరికి ఎంతో ఇష్టం! మరికొందరికి కాదు! ఒక్క నన్నే కాదు, ప్రతి పండునూ అమితంగా ఇష్టపడే వారూ, తినటానికి కష్టపడేవారూ మీకు కనిపిస్తారు. అందుకే అన్నారు కదా 'లోకో భిన్న రుచి' అని. ఏ పండుకైనా కావాల్సిందేమిటి చెప్పండి? కుళ్లి పోకుండా తింటే మాకంటే సంతోషించే వారెవరుం టారు? కొంతమంది ఉన్నారండీ నేను బాగా పండినపుడు వారు తినరు, ఇతరులకు పెట్టరు, నేను ఒక్కోసారి లోపలబాగానే ఉన్నా, నాశరీరం(తొక్క) నల్లబడేంతవరకు అలాగే ఉంచి ఎవరికైనా ఇచ్చారనుకోండి. ఇచ్చిన వాళ్లను కాకుండా నన్ను తిడతారు, కుప్పతొట్టిలో పడేస్తారు. అప్పుడు మాకు ఎంత బాధ, అవమానం కలుగుతుందో ఎప్పుడైనా మీకు ఆ పరిస్థితి వస్తే తెలుస్తుంది. ఇలాంటి గొడవలూ మాకెప్పుడూ ఉంటాయి. నేను మీకు కొన్ని విషయాలు చెబుదామని వచ్చి ఎప్పుడూ ఉండే సోది చెబుతున్నా.

ఆ మధ్య నా గురించి అమెరికా, ఐరోపా యూనియన్ వాళ్లు ప్రపంచ వాణిజ్య సంస్థలో వివాదపడ్డారు. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటివో) వారు పలుకుబడి కలిగిన అమెరికా వాళ్లనే సమర్థిస్తున్నారు. అంతేమరి కర్ర ఉన్నవాడిదే గొర్రె ! అన్నట్లు మీకు తెలుసా! అసలు అమెరికాలో మమ్మల్ని పండించరు. కానీ మాతో వ్యాపారం చేసే వారంతా అమెరికా కంపెనీల వారే. పండించేదొకరు, ఫలితం అనుభవించేదొకరు ! పేరుకు పళ్లమ్ముకునే వాళ్లమాదిరి ఉంటారా అమ్మో వాళ్లంటే కొన్ని దేశాలకు దేశాలే భయపడతాయి. అలాంటి దుర్మార్గులు. ఐరోపా వాళ్లు ఆఫ్రికా, కరీబియన్, పసిఫిక్ సముద్రప్రాంత(ఎసిపి) దేశాలను వలసలుగా చేసుకున్నారు కదా, 1992లో ఐరోపా యూనియన్ ఏర్పడినపుడు ఏసిపి దేశాలతో ఒక వప్పందం కుదుర్చుకున్నారు. ఈదేశాల్లో మాతో వ్యాపారం చేసే వాళ్లు కూడా తెల్లవాళ్లతో కూడిన కంపెనీలే. లాటిన్ అమెరికా దేశాల్లో మమ్మల్ని బాగా పండిస్తారు. అమెరికా కంపెనీలు అవసరమైతే మమ్మల్ని తక్కువ ధరకే ఇతర దేశాలకు ఎగుమతి చేస్తాయి. అందువలన ఐరోపా దేశాలు ఈ పోటీనుంచి ఏసిపి దేశాలను కాపాడేందుకు లోమ్-4 ఒప్పందం చేసుకున్నాయి. దాని ప్రకారం ఏసిపి దేశాల నుంచి ఎలాంటి దిగుమతి పన్నుల్లేకుండా మమ్మల్ని ఐరోపా యూనియన్ దేశాలకు అనుమతించాలి. ఇతర దేశాల నుంచి వచ్చే వాటిపై 20శాతం దిగుమతి పన్ను విధించాలని ఒప్పందం చేసుకున్నారు. అయితే దానిలో కొన్ని దేశాలు అంటే గతంలో వలసలు కలిగి ఉన్న బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ మాత్రమే ఉన్నాయి. అయితే అవసరమైన మేరకు దిగుమతులు రాని పక్షంలో లాటిన్ అమెరికాలో డాలర్‌తో వ్యాపారం చేసే దేశాల నుంచి మమ్మల్ని దిగుమతి చేసుకొనేందుకు కూడా ఆదేశాలు ఒక అవకాశాన్ని అట్టిపెట్టుకున్నాయి. అయితే ఐరోపా యూనియన్‌లో 1992 ఒప్పందం తరువాత కొత్తగా పది దేశాలు చేరాయి. అవి మేము లోమ్ ఒప్పందంలో లేము గనుక ఎక్కడనుంచి చౌకగా అరటిపళ్లు దొరికితే అక్కడి నుండి దిగుమతి చేసుకుంటామంటూ లాటిన్ అమెరికా నుండి



మమ్మల్ని దిగుమతి చేసుకుంటున్నాయి. దీని వలన ఏసిపి దేశాలకు వచ్చే నష్టాన్ని ఎలా పూడ్చాలా అన్న ప్రశ్న ఐరోపా యూనియన్ ముందుకు వచ్చింది.

తరువాత 1995లో ప్రపంచ వాణిజ్య ఒప్పందం అమలులోకి వచ్చింది కదా! మాతో వ్యాపారం ఏసిపి దేశాలకు జీవన్మరణ సమస్య, డాలర్ దేశాలకు, అక్కడి నుంచి మమ్మల్ని సేకరించే కంపెనీలకు లాభాల రక్షణ సమస్య. అందుకే అమెరికా రంగంలోకి దిగింది. ఒప్పందం ప్రకారం తన సభ్యదేశాల మార్కెట్‌లో ఏసిపి దేశాలకు అవకాశాలను పరిరక్షించటం ఐరోపా యూనియన్ బాధ్యత. అలాగే విండ్‌వార్డ్ దీవులు, జమైకా, బెల్జి, సురినామ్ దేశాల అరటి పళ్లకు మార్కెట్ హామీకి బ్రిటన్ కట్టుబడి ఉండాలి. ఒక్క జర్మనీ మాత్రమే ఎక్కడి నుంచైనా పన్నుల్లేకుండా మమ్మల్ని దిగుమతి చేసుకోవచ్చు. సహజంగానే డాలర్ దేశాలతో పోటీలో ఏసిపి దేశాలు తట్టుకోలేవు. దాన్ని సమతుల్యం చేయాల్సిన బాధ్యత ఐరోపా యూనియన్‌ది. అమెరికాలో మాతో వ్యాపారం చేసే మూడు కంపెనీలు ఉన్నాయి. వాటి పేరు చికితా, డోల్, డెల్‌మార్కెట్. ఐరోపా యూనియన్ మార్కెట్ అంటే ఈ కంపెనీలకు ప్రత్యేక ఆకర్షణ. చికితా కంపెనీ జర్మనీలో 40శాతం మార్కెట్‌ను చేజిక్కించుకుంది. ఇతర దేశాల్లో కూడా సింహభాగం ఆక్రమించాలని చూస్తోంది. ఏసిపి దేశాలకంటే తక్కువకు మార్కెట్లో మమ్మల్ని విక్రయించటంతో పోటీ పెరిగింది. ఏసిపి దేశాల పండ్లకు ప్రాధాన్యత, ఐరోపా పండ్లకు ఎలాంటి పన్ను లేకపోవటం, డాలర్ దేశాలనుండి వచ్చే వాటికి పన్ను విధించటం ప్రపంచ వాణిజ్య ఒప్పందానికి విరుద్ధమని ఈ కంపెనీ తన లాబీని రంగంలోకి దించింది. గాట్ కమిటీ 1994లో ఇది వివక్ష చూపటమే అని విమర్శించింది. లోమ్ ఒప్పందం 2000 సంవత్సరానికి ముగిసిపోతుందని, అప్పటివరకు అదనపు మొత్తాలను కొనుగోలు చేస్తామని ఐరోపాయూనియన్ ప్రతిస్పందించింది. అయితే తామంత కాలం వేచి ఉండలేమని చికితా కంపెనీ వత్తిడిని పెంచింది. అమెరికాను రంగంలోకి దించింది. తన దేశ చట్టాల ప్రకారం వ్యవహరించాలని అమెరికా వత్తిడి తేగా అది ప్రపంచ వాణిజ్య ఒప్పందానికి విరుద్ధమని ఐరోపా యూనియన్ స్పష్టం చేసింది. దాంతో డాలర్ దేశాల నుంచి ఎక్కువ మొత్తంలో అరటి పళ్లు దిగుమతి చేసుకోవాలని ఈక్వెడార్, గౌతమాలా, హోండురాస్, మెక్సికోలను చేరదీసి వాటితరపున అమెరికా డబ్ల్యుటిఓకు ఫిర్యాదు చేసింది. మరోవైపు తన వాణిజ్య చట్టాలను రుద్దేందుకు ప్రయత్నించింది. ఎలా కుదురుతుంది చెప్పండి. ఐరోపా యూనియన్ ఏమైనా చిన్నదా లొంగిపోవటానికి? విచారణ సమయంలో డబ్ల్యుటీవోలో అమెరికాకు వ్యతిరేకంగా కొన్ని తీర్పులు రావటంతో అమెరికాపై భారీ జరిమానాలు విధించేందుకు ఐరోపా యూనియన్‌కు అవకాశం దొరికింది. తాను మరింత ముందుకు పోతే అది రెండు ఏనుగుల మధ్య యుద్ధానికి దారితీస్తుందని అమెరికాకు తెలిసి వచ్చింది. దాంతో రాజీ చేసుకుందామని ప్రతిపాదించింది. దీనికి మరొక కారణం ఏమంటే అమెరికా ప్రభుత్వాన్ని ప్రభావితం చేసిన చికితా కంపెనీ దివాళా ప్రకటించింది. అమెరికా, ఐరోపా యూనియన్ మధ్య 2001లో ఒప్పందం కుదిరింది. దాంతో ఏసిపి దేశాల కోటాను ఐరోపా యూనియన్ తగ్గించింది. ఐదేళ్ల తరువాత తాము పన్నుల విధానాన్ని మాత్రమే అనుసరిస్తామని, లాటిన్ అమెరికా దేశాల ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను కల్పిస్తామని అంగీకరించింది. ఈ అవకాశాన్ని చికితా



ఎవరెక్కువ?

ఎవరికి వారు మేమే గొప్ప అని మీ మనుషులు చెప్పుకున్నట్లే మా పండ్లు కూడా వేటికవి తమ గొప్ప గురించి చెప్పుకుంటాయి. ఎవరు ఎక్కువ, తక్కువ అని వాదులాడుకోవటం వలన ప్రయోజనం ఏముంది చెప్పండి. వివరాలు తెలియకముందు ఏం మాట్లాడినా చెల్లుతుంది. ఇప్పుడు ఎక్కడ ఎన్ని ఆకులు ఉన్నాయో, ఎన్ని పండ్లు ఉన్నాయో కూడా లెక్కలేస్తున్నారు కదా. అందువలన ఉన్నది ఉన్నట్లు చెప్పుకోవాలి. ప్రపంచంలో ఎక్కువగా పండేది వరుసగా ద్రాక్ష, ఆరంజ్, ఆపిల్స్ వాటి తరువాతే మేము. ఏటా పండే మా బరువు 2.8 కోట్ల టన్నులట. లాటిన్ అమెరికాలో 65శాతం, ఆగ్నేయాసియాలో 27శాతం, ఆఫ్రికాలో ఏడుశాతం పండిస్తున్నారు. ఆసియాలో భారత్‌లో ఎక్కువగా మమ్మల్ని పెంచుతారు. మొత్తం ఇక్కడే తింటారు. అన్నట్లు మాలో ప్రతి ఐదుగురిలో ఒకరిని ఐరోపా, అమెరికా, కెనడా, జపాన్లకు పంపుతున్నారు. లాటిన్ అమెరికాలో బ్రెజిల్‌లో మమ్మల్ని ఎక్కువగా పండిస్తున్నారు. అనేక దేశాల్లో మేము లేందే మేము లేకుండా రోజు గడవదు. కూర అరటితో అనేక రకాల వంటకాలను తయారు చేసి భోజనంతో పాటు తింటారు. పోర్చుగీసు నావికుల ద్వారా 1502లో తొలిసారిగా కరీబియన్, మధ్య అమెరికా దేశాల్లో మమ్మల్ని సాగు చేశారని చరిత్రలో రాశారు.

బనానా రిపబ్లిక్‌లు

ప్రమీలార్జునీయం మాదిరి అందరూ మహిళలే ఉండే దేశం మాదిరి బనానా రిపబ్లిక్ అంటే కేవలం మేమే ఉండే దేశం అనుకోకండి. నిజానికి ఆ పేరు తెచ్చుకోవాలని ఏదేశం కోరుకోదు. ఎవరన్నా ఆ పేరుతో పిలిస్తే దానికి ఎంతో అవమానం. మనలో మాట ఎవరైనా మామీద కాలు వేశారనుకోండి.. జర్రున జారిపోయి నడుం విరుగుతుంది. కాలికి మాకు అంతవైరం మరి. మేం మనుషుల నడుములు, కాళ్లే విరగ్గొడతాం. కానీ మాతో వ్యాపారం చేసి సంపాదించే వారు మాత్రం ప్రభుత్వాలనే కూల్చివేస్తారు, తమ మాట వినకపోతే ఎవరినైనా అంతం చేస్తారు. అంత దుర్మార్గులు మరి. బనానా రిపబ్లిక్‌లంటే ఒకవైపు అంతులేని సంపదలున్నవారు, వారికి మద్దతుగా అవినీతి అధికారులు, మరొకవైపు దిక్కూమొక్కులేని జనం, రాజకీయ అనిశ్చితికి మారుపేరుగా ఉంటాయి.ఇక్కడ అధికారంలో ఉన్న విదేశీ లేదా స్వదేశీ వాణిజ్యవేత్తల కనుసన్నల్లో ఉంటారు. లాటిన్ అమెరికాలోని స్పానిష్ వలసదేశాల్లో ఇటువంటి పరిస్థితి ఉండేది. హొండూరాస్‌లో తమ కంపెనీకి అవసరమైన రాయితీలు, ప్రాధాన్యత పొందేందుకు గాను యునైటెడ్, స్టాండర్డ్ ఫ్రూట్ కంపెనీలు ప్రయత్నించాయి. యునైటెడ్ కంపెనీని 'ఆక్టోపస్' అని పిలిచే వారు. అక్కడ 1910లో కైమెల్ ఫ్రూట్ కంపెనీ- యునైటెడ్ కంపెనీ మధ్య వాణిజ్యపోటీ తలెత్తి, హొండూరాస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కైమెల్ కంపెనీ అమెరికా నుంచి కిరాయిమూకలను రప్పించింది. గౌతమాలాలో సోవియట్‌కు అనుకూలంగా ఉన్న వామపక్షవాది కల్నల్ అర్బెంజ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ 1954లో అమెరికా అధ్యక్షులు ట్రూమన్, ఐసెన్‌హోవర్ ప్రభుత్వాలనే ప్రభావితం చేసింది. అందుకే వాణిజ్యవేత్తలు ఎవరైనా రాజకీయాలను ప్రభావితం చేస్తే అటువంటి దేశాలను బనానా దేశాలని ఇప్పటికీ విమర్శిస్తున్నారు. కొలంబియాలో తమ వ్యతిరేకులను హతమార్చేందుకు 20లక్షల డాలర్లు ఇచ్చినట్లు చికితా కంపెనీ అంగీకరించింది. విదేశీ రుణం పెరిగిపోవటాన్ని ప్రస్తావించి తమదేశం బనానా రిపబ్లిక్‌గా మారే ప్రమాదం ఉందని 1986లో నాటి ఆస్ట్రేలియా ఆర్థిక మంత్రి పాల్ కీటింగ్ వ్యాఖ్యానించారు. ఈఏడాది జనవరి 22న పాక్ అధ్యక్షుడు ముషరఫ్ పాక్ పరిణామాలను వివరిస్తూ మనది బనానా రిపబ్లిక్ కాదని అన్నారు.

మా పెద్దవాళ్లు చెప్పినదాని ప్రకారం గతశతాబ్దిలో యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ లాటిన్ అమెరికాలో డజను దేశాలను ప్రభావితం చేసింది. ఇది అనేక దేశాల ప్రభుత్వాలకంటే శక్తివంతమైనది. కోస్టారికాలోని రైల్వేలైన్ల పక్కన 1870దశకంలో సరదాగా అరటి మొక్కలు నాటిన రెండుపదుల వయస్సున్న మైనర్ కీత్, అతని స్నేహితులు వాటి నుంచి అంతులేని సంపదలను ఆర్జించవచ్చని, చివరకు ఆర్రైల్వే లైన్లపైనే ఆధిపత్యం వహించవచ్చని తొలుత ఊహించి ఉండరు.

మా జన్మస్థలం



చాలా మంది మా జన్మస్థలం ఏదని అడుగుతుంటారు. ఈ విషయం నేను మా అమ్మను అడిగాను. ఆమెకు వాళ్ల అమ్మ చెప్పినదాని ప్రకారం మా అసలు పుట్టిల్లు ఇండో - మలేషియా ప్రాంతం నుంచి ఆస్ట్రేలియా వరకు ఉందట. అసలు మేము తియ్యగా ఉంటామని తినటానికి పనికి వస్తామని చాలా కాలం వరకు ఈ జనానికి తెలియదు. కాని క్రీస్తుపూర్వం మూడవ శతాబ్ది నాటికి మధ్యధరా సముద్రప్రాంతంలో మమ్మల్ని కొందరు తింటున్నట్లు మా పెద్దవాళ్లు చెబుతారట. సముద్రనావికులు ఈ దేశాల నుంచి పదవశతాబ్దిలో ఐరోపాకు తీసుకువెళ్లారు. పదహారవ శతాబ్దంలో పోర్చుగీసు నావికులు మా చెట్లను పశ్చిమాఫ్రికా తీరం నుంచి దక్షిణ అమెరికాకు తీసుకు వెళ్లారు. పసిఫిక్ దేశాల్లో పండే మా పూర్వీకులను ఇండోనేషియాలో కనుగొన్నట్లు చెబుతారు. అక్కడి నుంచి అంచెలంచెలుగా హవాయి దీవులకు తీసుకు వెళ్లారట. చరిత్రలో మా గురించి తొలిసారి క్రీస్తు పూర్వం ఆరువందల సంవత్సరాల క్రితమే బౌద్ధుల రాసినట్లు చెబుతారు. భారత్‌పై దండెత్తిన అలెగ్జాండర్ క్రీస్తుపూర్వం 327లో మమ్మల్ని రుచి చూసి ముచ్చటపడ్డాడట. క్రీస్తుశకం 200 నాటికి మమ్మల్ని ప్రత్యేకంగా చైనాలో సాగుచేసినట్లు కూడా చరిత్ర చెబుతోంది. ఆరువందల యాభై సంవత్సరాలలో దండయాత్రలు చేసిన ముస్లింలు అరటి మొక్కలను పాలస్తినాకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అరబ్బు వర్తకులు ఆఫ్రికా అంతటికీ విస్తరింపచేశారు. మా పుట్టుక, పెరుగుదల ఎంతో ఆసక్తికరం. ఒక మొక్కకు ఒక గెల మాత్రమే పుడుతుంది. దాంతో మా అమ్మ పని అయిపోయినట్లే, అమ్మకు అనేక పిల్లమొక్కలం పుడతాం, అమ్మనుంచి మమ్మల్ని వేరు చేసి పెంచుతారు. ఒకే మొక్కకు ఆడ మగ పుష్పాలు పూయటం మాప్రత్యేకత. ఆడపుష్పాలు పండుగా మారగానే మగ పుష్పాలు రాలిపోతాయి. చెట్టుకు ఉన్నంత వరకు మేము ఆకు పచ్చగా ఉంటాం. తరువాతే మామీద బాక్టీరియా చేరటంతో రంగుమార్చుకుంటాం.మీరు తినటానికి వీలుగా మారతాం. అన్నట్లు మీరు తెలుగువారు కదా మా ఆకులు లేనిదే కొన్ని చోట్ల భోజనం చేయరు తెలుసా? ఇప్పుడు మా రూపంలో ప్లాస్టిక్ ఆకులు కూడా తయారవుతున్నాయంటే మాకున్న ప్రాధాన్యతేమిటో మీకు చెప్పనవసరం లేదు.

మొక్కా చెట్టా ?

కొంత మంది పెద్ద మొక్కతప్ప, మమ్మల్ని చెట్టు కాదంటారు, ఎందుకంటే మాకు పెద్ద ఆకులు తప్ప వేరే కొమ్మలుండవు, అదే విధంగా మిగతా చెట్లమాదిరి మా కాండం గట్టిగా ఉండదు. మేము మీ వేళ్లలాగా ఉంటాం కనుక మమ్మల్ని అరబ్బులు వేలు పండు అనే వారు. అరబ్బీ నుంచి మాపేరు చివరకు బనానాగా ఖరారు చేశారట.

కంపెనీ వినియోగించుకొని నష్టాల నుంచి బయటపడింది. ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తే తప్ప తాము దోహా దఫా చర్చల్లో పాల్గొనేది లేదని ఏసిపి దేశాలు ప్రకటించాయి. ఈ ప్రకటనలు అరటి పళ్ల యుద్ధానికి దారితీశాయి. లాటిన్అమెరికా, నాన్ ఏసిపి దేశాల నుండి దిగుమతి చేసుకొనే కోటా అరటిపళ్లకు టన్నుకు 75 యూరోల పన్ను చెల్లించాలి. ఎసిపి దేశాల నుంచి వచ్చే పళ్లకు ఎలాంటి పన్నులు చెల్లించనవసరం లేదు. ఐరోపా యూనియన్ కొత్త విధానం ప్రకారం ఎక్కడనుంచి దిగుమతి చేసుకున్నప్పటికీ టన్నుకు 230 యూరోలు చెల్లించాలని ఐరోపా యూనియన్ ప్రకటించింది. గతనెల మూడున ఈ పథకాన్ని లాటిన్ అమెరికా దేశాలు విమర్శించాయి. ఇంత మొత్తం పన్నుంటే తాము ఎగుమతులు చేయలేమని, తమ దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం అవుతాయని పేర్కొన్నాయి. మరోవైపు ఎసిపి దేశాలు పన్ను ఎక్కువేమీ కాదని, 275 యూరోలు ఉండాలని తాము కోరుతున్నట్లు తెలిపాయి. ఐరోపా యూనియన్‌కు మద్దతుగా నిలిచాయి. తమ డిమాండ్ పెరుగుతున్నందున పన్ను విధించినా ఎసిపిదేశాలకు ఎలాంటి ప్రమాదం ఉండదని ఐరోపా యూనియన్ చెబుతోంది. అయితే భారీ సబ్సిడీలకు అవకాశం ఉన్న అమెరికన్ కంపెనీలు ఏసిపి దేశాలను త్వరలోనే వెనక్కు నెడతాయని కొద్దిరోజుల్లోనే వెల్లడైంది. అమెరికా వత్తిడి మేరకు ఐరోపా యూనియన్ పన్ను మొత్తాన్ని 176 యూరోలకు తగ్గించింది. పర్యవసానంగా డాలర్ దేశాల సరకు 73శాతం మార్కెట్‌ను ఆక్రమించింది. ఎసిపి దేశాల వాటాతో పాటు ఐరోపా యూనియన్



ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఈపన్ను గురించి అమెరికా, లాటిన్ అమెరికా దేశాలు ఫిర్యాదు చేశాయి. ఇదే సమయంలో ఈ మొత్తం కూడా ఎక్కువే అని ప్రపంచ వాణిజ్య సంస్థ ఇచ్చిన తీర్పుతో దానిని మరింతగా తగ్గించటం లేదా ఎత్తివేయవచ్చని భావిస్తున్నారు. దీన్ని ఎదుర్కొనేందుకు ఎసిపి దేశాలు సన్నద్ధమౌతున్నాయి.

❊

మాకు ముప్పువస్తోంది

ఈ ప్రపంచం గురించి ఏం చెప్పమంటారు ! అనేక జీవరాశులకు మానవులు ముప్పు తెస్తున్నారు. మాక్కూడా ఆ ప్రమాదం ఉందంటున్నారు. మేం కూడా త్వరలో అంతరించి పోతామంటున్నారు. ముందుతరాల వారు మమ్మల్ని తినాలంటే మమ్మల్ని రక్షించుకోవాలి కదా. గతంలో ఒక చెట్టు నుంచి వచ్చే పిలకలు 50 సంవత్సరాల పాటు పళ్లను ఇచ్చేవి. ఇప్పుడు ఐదేళ్లకే వాటి పని అయిపోతోంది చాలాచోట్ల. చెట్లు పెరిగినా పళ్లు కాయకపోవటం జరుగుతోంది. బ్రస్సెల్స్ నగరంలో ఉన్న లేవాన్ విశ్వవిద్యాలయంలో ఉన్న ఒక ప్రయోగశాలలో 1200 రకాలకు పైగా ఉన్న అరటి మొక్కలను, అరటి జీన్స్‌ను టెస్ట్‌ట్యూబుల్లో నిల్వచేశారు. జీన్స్‌ను వేరు చేసి తెగుళ్లను తట్టుకొనే బలమైన రకాల తయారీకి కూడా పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు లేని హైబ్రిడ్ మొక్కను రూపొందించారని, అది తెగుళ్లను తట్టుకుంటుందని చెబుతున్నారు.

హైదరాబాద్‌లో మౌస్ అని ఎందుకంటారు?

మమ్మల్ని హైదరాబాద్‌లో కొందరు మౌస్ అంటారు. ఉర్దూలో మా పేరు అది. మేము మౌసేసియా కుటుంబానికి చెందిన మొక్కలం కనుక దాన్నుంచి కూడా ఆ పేరు వచ్చింది. మాకు ప్రపంచంలో చాలా పేర్లున్నాయండోయ్. స్పానిష్ మాట్లాడేవారు మమ్మల్ని 'చైనా' అంటారు తెలుసా! పోర్చుగీస్ పేరు బనానా మకా, బనానా డపార్టా. ఇలా చాలా ఉన్నాయి లెండి. అన్నట్లు మరొక విషయం కూడా ఉందండోయ్. కొన్ని చోట్ల మమ్మల్ని అలంకార ప్రాయంగా పెంచితే, మరికొన్ని చోట్ల మాలో కొన్నిరకాలు ఇచ్చే నారకోసం కూడా పెంచుతారు. మా నారతో బలమైన తాళ్లతో పాటు టీ బాగ్స్ కూడా తయారు చేస్తున్నారు. ఇథియోపియా వంటి కొన్ని చోట్ల మా లేతకాండాన్ని ఆహారం తయారీకి వినియోగి స్తున్నారు. మాలో కూడా విత్తనాలు ఉండే రకాలు, లేని రకాలు ఉన్నాయి. భారత్‌లో తినే అరటి, కూర అరటి అంటారు తప్ప మమ్మల్ని ఒకే పేరుతో పిలుస్తారు. కాని ఇతరదేశాల్లో రెండు రకాలకు రెండు పేర్లు ఉన్నాయి. ఆంగ్లంలో కూర అరటిని పాలంటైన్ అంటారు.

సమ్‌థింగ్ స్పెషల్

శనగపాటి మురళీకృష్ణ, ఖమ్మం.

చూడ్డానికి అతనో సాధారణ చర్మకారుడు.
తల వంచుకొని తన మానాన తను పని చేసుకుపోతుంటాడు.
ఇది తన వృత్తి.
నోరు తెరిచి పాట పాడాడో....
అతనో అద్భుత గాయకుడని అర్థమైపోతుంది.
ఇది అతని ప్రవృత్తి.
ఇంతకీ ఎవరతను?! ఎక్కడ వుంటాడు?! అంటే మాత్రం ఖమ్మం వెళ్లాల్సిందే!!





ఘంటసాలను మరిపిస్తున్న చర్మకారుడు

అది నిత్యం రద్దీగా ఉండే ఖమ్మం వైరా రోడ్ ప్రాంతం. ఫుట్‌పాత్‌పై చెప్పులు కుడుతూ 60 సంవత్సరాల వృద్ధుడు కనిపిస్తాడు. కొత్తగా చూసేవారు అతణ్ణి మామూలు చర్మకారుడే అనుకొంటారు. నాలుగు దశాబ్దాలకు పైగా అక్కడే వృత్తిని నిర్వహిస్తున్న ఆయన పేరు దేవప్రియ ఉరఫ్ ఖమ్మం ఘంటసాల. ఆయనను ఎరిగిన వారు ఘంటసాల దేవప్రియగా పిలుస్తుంటారు. పలు స్వచ్ఛంద సంస్థలు, సాంస్కృతిక సంస్థల నుంచి 30కి పైగా అవార్డులు అందుకున్న ఆయన జీవితంలోకి తొంగి చూస్తే...

చర్మకారునిగా దైనందిన జీవనం సాగిస్తున్న దేవప్రియకు సంగీతం అంటే ప్రాణం. ఆ విధంగా ఘంటసాల అభిమానిగా మారారు. పాటలను కంఠస్తం చేశారు. ఎక్కడైనా, ఎవరైనా సభ పెట్టి పిలిస్తే చాలు... ప్రతిఫలం ఆశించకుండా వెళ్లి పాడేస్తారు. ఆ సమయంలో ఎవరైనా వేదికపై నున్న ఇతడిని చూడకుండా పాట వింటే ఘంటసాల వచ్చి పాడారని భావించాల్సిందే. అంత మధురమైన గొంతు దేవప్రియది. చెప్పులు కుడితేనే ఇల్లు గడుస్తుంది. అటువంటి వ్యక్తి అన్నీ తానై ప్రతి ఏటా ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఖమ్మంలో దాతల సహ కారంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 'శివశంకరి...శివానంద లహరి' అనే పాట అతనికి బాగా పేరు తెచ్చి పెట్టింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ పాట పాడి అందరిని తన్మయులను చేశారు. అప్పటికప్పుడే శాలువా కప్పి సన్మానించారు పెద్దలు. "అది నన్ను ఎంతో అబ్బురపరిచింది. అరవైలలో ఉన్నా ఇరవైలాగా ఫీల్ అవుతూ పాటలు పాడటానికి స్ఫూర్తినిచ్చింది" అంటారు దేవప్రియ.

దేవప్రియ తన అభిమాన గాయకుడిని రెండుసార్లు కలుసుకున్నారు. మొదటిసారిగా 1957లో ఒక మిల్లు ప్రారంభించడానికి ఘంటసాల ఖమ్మం వచ్చినప్పుడు... రెండోసారి 1967లో తను మద్రాసు వెళ్లినప్పుడు. ఈ రెండు సందర్భాలు తన జీవితంలో అరుదైన విషయాలంటారు దేవప్రియ.

సినిమాలు చూడ్డానికి డబ్బులుగాని, సమయంగాని లేని దేవప్రియ కేవలం ఆసక్తి, అభిమానం, సాధనతోనే ఘంటసాల పాడిన పాటలను ఆలపించి పలువురిని అల రిస్తున్నారు.

ఇంతకీ దేవప్రియ లక్ష్యం ఏంటో చెప్పుకోలేదు కదూ! ఘంటసాల పాటలను 'రీమిక్స్'గా నవతరానికి అందించాలను కుంటున్నారు. అసలు పాటలకంటే రీమిక్స్‌లైతే యువత బాగా ఆదరిస్తారంటారాయన. ఎలాగైనా ఘంటసాల పాటలను ముందు తరాలకు కూడా అందించాలన్నదే ఆయన తపనంతా.

❋





కథ

రాజకీయం

కథా నిలయం
శ్రీకాకుళం

పీపీ

తను మాత్రం వీళ్లను పట్టించుకోనట్టే చేస్తున్నది. తన కర్ర పుల్లతో తను ఆడుకుంటున్నది. అక్కా తమ్ముళ్ల దగ్గర రెండు మంచి బొమ్మలున్నాయి. కాని ఆమె తమనుంచి వచ్చేసి దూరంగా వుండటంతో వారు ఆమెనే చూస్తుండి పోయారు. చివరకు అక్క మాట్లాడించింది...

'కర్రతో ఆడుతున్నావా' అని అడిగింది. ఆ పాప కాస్సేపు నిర్లిప్తత కన్పరచినా తర్వాత స్పందించింది.

'ఇది మా అత్త వాళ్లింట్లో తెచ్చాను తెలుసా?' అని. 'అట్లనా?' అని అక్క ఆసక్తి ప్రదర్శించింది. నిజానికి ఆ పాప దగ్గర ఆకర్షణీయమైన వస్తువేదీ లేదు అయినా అక్కడ చర్చ మొదలైపోయింది.

'మా ఇంట్లో ఇంకా పెద్ద కర్ర వుంది' అని అక్క గొప్పగా చెప్పింది. కాని ఆ పాప పడనివ్వలేదు.

'కాదమ్మా, ఇది అడవి కట్టె. దీని మధ్య లో గీతలా వుంటుంది.... ' అంటూ వూరించింది.

చర్చలు వేడిక్కెనట్టు అక్కడ వాతావరణమే చెబుతున్నది. ఎవరికి వారు తమ వాదన చెప్పాలని ఆతృతగా వున్నారు. అవతలి వారి వాదనలు అసహనంగా వింటున్నారు. ఆ నాయకుడు రైటంటే ఈ నాయకుడు రైటని వాదించుకుంటున్నారు. కొన్ని సార్లు వారి కోప తాపాలు శ్రుతిమించి పోతున్నాయి.

తమ స్వార్థం కోసం ఎవరో బడా నాయకులు ఏదో రెచ్చగొడుతుంటే వీరంతా ఇలా ఘర్షణ పడటం నాకు నచ్చలేదు. బాగా ఆలోచించిన మీదట ఒక విషయం చెప్పాలని పించింది. నిన్నటి నుంచి అనుకుంటున్న విషయమే అయినా దాన్ని ఈ సందర్భానికి అన్వయించే అవకాశం కనిపించింది.

'ఆ నాయకుడు అంత ఇదిగా చెప్పినా నమ్మకపోతే ఎలా? వేణు అంటున్నాడు.

'అంతా నాటకమని తెలియడం లేదా?' శంకరం అంతే కసిగా అన్నాడు.

"వేణు నేను చెప్పేదేమంటే..." నెమ్మదిగా రంగంలోకి దిగాను.

అప్పటి వరకూ మౌనంగా వున్న నేను చర్చలో ప్రవేశించేసరికి వారి ఆసక్తి పెరిగింది. నా అభిప్రాయం కోసం వాళ్లు ఎదురు చూస్తున్నట్టు అర్థమైంది. కాని నేను చర్చలో తలదూర్చ దలచలేదు. కాకపోతే వారిలో ఆలోచన కలిగించాలనిమాత్రం వుంది.

'మీరెప్పుడైనా భేతాళ కథలు చదివారా?' విక్రమార్కుడు ప్రతి సారి శవాన్ని భుజాన వేసుకుని వస్తుంటాడు. మధ్యలోకి రాగానే శవంలోని భేతాళుడు 'రాజా' అని మాట్లాడించి 'నీవు ఎవరి కోసం శ్రమ పడుతున్నావో తెలుసా!' అని ముగ్గులోకి దింపుతాడు.

'ఇది రెండో క్లాసు నుంచి వింటున్నాం...'

'కదా! ఇప్పుడు నాకు కూడా మీరు ఎవరి కోసం ఇంతంగా వాదించుకుంటున్నారో అర్థం కావడం లేదు. అందుకే భేతాళుడిలాగే మీకు ఒక కథ చెబుతాను. దాన్ని విన్నాక ఆలోచించుకోండి'.

❊ ❊ ❊

నిన్న సాయంత్రం నేను మా ఆవిడ కలిసి బజారుకెళ్లాం. మా ఆవిడ కూరగాయలు తెచ్చు కోవడానికి వెళ్లింది. నేను బయటే బండి మీదే కూర్చున్నాను. అప్పుడు వచ్చారు ముగ్గురు పిల్లలు... నేను వున్నచోటికి చాలా దగ్గరగా కూర్చుని ఆడుకోవడం మొదలెట్టారు. కాని ఎందుకో ఆట సాగలేదు. లేచి దూరంగా వెళ్లి పోయారు... ఇంతలోనే ముగ్గురిలో ఒక పాప వక్కతే వచ్చేసింది. ఎందుకో.... తెలుసుకోవాలనే ఆతృతతో గమనించసాగాను. వారిలో ఇద్దరూ అక్కా తమ్ముళ్లు. అందువల్ల ఆటలో మూడో అమ్మాయి మాట చెల్లినట్టు లేదు. కొంచెం అలిగి వచ్చేసింది..... తను ఒక్కతే ఏదో కర్ర పుల్ల తీసుకుని దాంతో ఆడుకోవడం మొదలెట్టింది... ఆమె వచ్చిన తర్వాత కాస్సేపు అక్కా తమ్ముళ్లే మాట్లాడుకున్నారు. కొన్ని సార్లు మొహాలు చూసుకున్నారు. కళ్లతోనే మాట్లాడుకున్నారు. తర్వాత నెమ్మదిగా ఇటు కేసి వచ్చారు. వచ్చి ఈ అమ్మాయికి కాస్త దగ్గరగా లేక కాస్త దూరంగా నిలుచుని గమనించసాగారు.

తను మాత్రం వీళ్లను పట్టించుకోనట్టే చేస్తున్నది. తన కర్రపుల్లతో తను ఆడుకుంటున్నది. అక్కా తమ్ముళ్ల దగ్గర రెండు మంచి బొమ్మలున్నాయి. కాని ఆమె తమనుంచి వచ్చేసి దూరంగా వుండటంతో వారు ఆమెనే చూస్తుండి పోయారు. చివరకు అక్క మాట్లాడించింది...

'కర్రతో ఆడుతున్నావా?' అని అడిగింది. ఆ పాప కాస్సేపు నిర్లిప్తత కన్పరచినా తర్వాత

స్పందించింది.

'ఇది మా అత్త వాళ్లింట్లో తెచ్చాను తెలుసా?' అని అంది.

'అట్లనా?' అని అక్క ఆసక్తి ప్రదర్శించింది. నిజానికి ఆ పాప దగ్గర ఆకర్షణీయమైన వస్తువేదీ లేదు అయినా అక్కడ చర్చ మొదలైపోయింది.

'మా ఇంట్లో ఇంకా పెద్ద కర్ర వుంది' అని అక్క గొప్పగా చెప్పింది. కాని ఆ పాప పదనివ్వలేదు.

'కాదమ్మా, ఇది అడవి కట్టె. దీని మధ్య లో గీతలా వుంటుంది....' అంటూ వూరించింది.

'ఏది చూస్తాను' అని అక్క తమ్ముడు ముందుకు కదిలారు. కాని ఆ పాప వారిని పట్టించుకోలేదు. 'ఇది పోతే మా అత్త అరుస్తుంది' అని బ్రేకేసింది.

'వూరికే ఒకసారి చూసిచ్చేస్తానే' అక్క కొంచెం ప్రాధేయపడినట్టే అడిగింది.

'సరే, త్వరగా ఇచ్చేసెయ్..' ఎట్టకేలకు ఆ పాప దాన్ని ఇచ్చింది.

అక్క తమ్ముడు దాన్ని మార్చి మార్చి చూశారు. అందులో వారికి పెద్ద వింత ఏదీ కనిపించినట్టు లేదు. కాని ఆ మాట చెప్పకూడదని నిర్ణయించుకున్నట్టున్నారు.

'బాగుందే' అని అక్క ప్రకటించింది. దాని స్వంతదారు కళ్లలో ఒకింత గర్వం తొణకిస లాడింది. అది దూరంగా వున్న నాకు అర్థమవుతున్నది గాని ఆ పిల్లలకు తెలియలేదు. వారు ఇక ఆమెను ఆటలోకి పిలవాలనే ప్రయత్నాలు మొదలెట్టారు.

.....

'రా మళ్లా ఆడుకుందాం' అని పిలిచారు.

'వూహూ మీరు ఇంతకు ముందు నన్ను పంపించేశారు కదా...' తను సాధించడం మొదలుపెట్టింది.

'కాదే, వూరికే అన్న. మనం ఎప్పుడూ డియరెస్టు ఫ్రెండ్సుమే కదా' అంటూ బుజ్జగించింది.

తను మెత్తబడినట్టు మొహం పెట్టి వచ్చింది. ఇప్పుడు ఆమె కళ్లు మరీ మెరిసి పోతున్నాయి. ఇంతకు ముందు వారి ఆట ఆగిపోయిన చోటనే మళ్లీ మొదలెట్టారు.

❊❊❊

ఏం ఆట ఆడదాం?

'టీచరు, పిల్లల ఆట ....'

'సరే, నేను టీచరు, మీరు పిల్లలు...' అక్క చెప్పింది.

'నేను కూడా టీచరునే' మరోసారి ఆ పాప పేచీ పెట్టింది.

అక్క కాస్సేపు ఒప్పించేందుకు ప్రయత్నించింది. కాని ఆ పాప వినలేదు.

'అయితే నా కర్ర నాకిచ్చేయ్' అంది.

'సరే, ఇద్దరం టీచర్లమే లే..' అక్క దిగి రాక తప్పలేదు. పిల్లాడు అయోమయంగా చూస్తున్నాడు. ఎందుకంటే వాళ్లిద్దరూ టీచర్లయితే స్టూడెంటుగా తను ఒక్కడే మిగులుతాడు. కాని ఏం చేస్తాడు?

కాస్సేపటికి ఆ దశ అయిపోయింది. మళ్లీ తను 'నా కర్ర ఇవ్వను' అంటూ బెదిరించింది. ఈ సారి అక్కా తమ్ముడు మొహాలు చూసుకోలేదు.

'ఇవ్వకపోతే పో' ఒక్కసారిగా అన్నారు. తను బిత్తర పోయింది.

'మా ఇంటి దగ్గరకెందుకు వచ్చావ్?' అని నిలదీశారు. వాళ్లు ఆడుకుంటున్నది వీళ్ల ఇంటి ముందని అప్పుడు అర్థమైంది.

'మీరు కూడా మా ఇంటిదగ్గర కొస్తారుగా' అని ఎదురు వాదన చేసింది.

'ఇప్పట్నుంచి రాములే' అని అక్కా తమ్ముడు బదులిచ్చారు.

'రేపు మా నాన్న నాకు మంచి సైకిల్ తీసుకొస్తానన్నాడు' అని మరో అస్త్రం తీసింది.

'తెస్తే నీవే తొక్కుకో. మా దగ్గర కూడా వుంది' అంటూ ముందే సిద్ధంగా వున్నట్టు జవాబు సంధించారు.

సరే వాడికి పాఠాలు చెప్పడం మొదలైంది.

ముందు ఎవరు చెప్పాలి, ఏది చెప్పాలి ప్రతిదానిపైన ఆ పాప తనే ముందుండాలంటోంది. అక్క ఏదైనా చెప్పబోతే నా కర్ర నాకిచ్చెయ్ అని లోబర్చుకుంటుంది.

తను ఏది చెప్పినా కాదనకుండా విన్నారు. అన్ని విషయాల్లో 'మొదటి ఛాన్సు' ఇచ్చారు.

ఎన్ని చేసినా ఆ పాప బెట్టు పెరుగుతున్నదే గాని తగ్గడం లేదు. మాట్లాడితే 'నా కర్ర నాకిచ్చేయ్ అంటుంది. అన్ని తను చెప్పినట్టే జరగాలనుకుంటుంది. అక్కా తమ్ముళ్లు చాలా ఇరకాటంలో పడి పోయారు. మాటి మాటికి మొహాలు చూసుకున్నారు. కాని ఆట ఆగిపోకూడదని అన్నిటికీ ఒప్పుకుంటున్నారు. నేను అన్నీ గమనిస్తున్నాను. పైగా మా ఆవిడ కూడా రాలేదు. ఆ బాలకాండ ఇలా ఎంత సేపు జరుగుతుదో ఎలా జరుగుతుందో చూడాలని డిసైడై పోయాను.

కాస్సేపటికి ఆ దశ అయిపోయింది. మళ్లీ తను 'నా కర్ర ఇవ్వను' అంటూ బెదిరించింది. ఈ సారి అక్కా తమ్ముడు మొహాలు చూసుకోలేదు.

'ఇవ్వకపోతే పో' ఒక్కసారిగా అన్నారు. తను బిత్తర పోయింది.

'మా ఇంటి దగ్గరకెందుకు వచ్చావ్?అని నిలదీశారు. వాళ్లు ఆడుకుంటున్నది వీళ్ల ఇంటి ముందని అప్పుడు అర్థమైంది'

'మీరు కూడా మా ఇంటిదగ్గర కొస్తారుగా' అని ఎదురు వాదన చేసింది.

'ఇప్పట్నుంచి రాములే' అని అక్కా తమ్ముడు బదులిచ్చారు.

'రేపు మా నాన్న నాకు మంచి సైకిల్ తీసుకొస్తానన్నాడు' అని మరో అస్త్రం తీసింది.

'తెస్తే నీవే తొక్కుకో. మా దగ్గర కూడా వుంది' అంటూ ముందే సిద్ధంగా వున్నట్టు జవాబు సంధించారు.

'అయితే అప్పుడు నేనిచ్చిన స్వీటు ఎందుకు తిన్నావ్?' అంటూ ఆ పాప మరేదో అనబోయింది. వాళ్లు దానికి జవాబివ్వలేదు. అక్కడ నుంచి కదలి మరో చోట ఆట మొదలెట్టారు. ఈ పాప బిక్కమొహం వేసుకుని కాస్సేపు చూసి భారంగా అడుగులు వేస్తూ కదలిపోయింది. అక్కా తమ్ముళ్లు హాయిగా ఆడుకోవడం నేను చూస్తుండగానే మా ఆవిడ కూరగాయల కొనుగోలు పూర్తిచేసి వచ్చింది.

❊❊❊

కథ పూర్తి చేసి చూద్దును గదా నా ప్రియ నేస్తులు మింగేశాలా చూస్తున్నారు. అయినా చివరకు నేను చెప్పే పాయింటు విన్నాక వారు నా దారికి వస్తారనే నమ్మకం వుంది . అందుకే ఏమాత్రం ఆలస్యం లేకుండా మొదలుపెట్టాను.

'నేను ఈ కథ మీకెందుకు చెప్పానో అర్థమైందా? ఇందాకటి నుంచి మీరు ఆ నాయకుడు అలా అన్నాడని, ఈ నాయకుడు ఇలా చేశాడని మరెవరో ఏదో చేస్తారని తెగ ఇదిగా మాట్లాడుకుంటున్నారు. కాని సంగతేమంటే వాటిని సరిగ్గా పరిశీలించి మనకు జరిగే మంచి చెడ్డలు నిర్ణయించుకోవాలి. లోకంలో ఎవరి ప్రయోజ నాలు వారు కాపాడుకోవాలి. ఎవరు ఏ మాట ఎందుకు మాట్లాడుతున్నారో తెలుసుకోవాలి. పెత్తనం కోసం చాలామంది చాలా చేస్తారు. ఇందాకటి పాపనే చూడండి. తన దగ్గర వున్న కర్ర పుల్ల గొప్పదేమీ కాదు. వీళ్లు అక్కా తమ్ముడు ఇద్దరున్నారు. పైగా ముద్దొచ్చే బొమ్మలు కూడా వున్నాయి. అయినా ఆ పాప వేసిన పాచికలకు పడిపోయి తన చుట్టూ తిరిగారు. అలాగే మీరు కూడా తమ పదవుల కోసం ఎవరెవరో ఏదో హడావుడి చేస్తుంటే అసలు సంగతి తెలుసుకోలేక వలలో పడుతున్నారు. మన వీధుల్లో ఆటాడుకునే పిల్లలను చూసినా ఈ ఎత్తులు పై ఎత్తులు అర్థం చేసుకోవచ్చు గదా'

ఇప్పుడు నా నేస్తాలకు నా భావం బోధపడినట్టేవుంది.

'రాజకీయం అంటే ఏమిటో కాదు, జీవితంలో అడుగడుగునా మనకుండే ఇంగితజ్ఞానానికి అవగాహన జోడించి మరింత పెద్ద విషయాలకోసం ఉపయోగించుకోవడమే' వెళ్లే ముందు వేణు అన్న మాటలు విన్నాక నా ప్రయత్నం ఫలించినట్టే అనిపించి తృప్తిపడ్డాను. అందరూ ఆలోచనగా ఇళ్లకు కదిలారు.

❊

డా॥ జె.పి.వైద్య



ఘంటసాల గారు సున్నితంగా తిరస్కరించారు.

ఘంటసాల అభిమానుల్లో ఎవరు లేరనీ?

తెలుగు సినీ సంగీత రంగంలో ఆయన వారసులుగా పేరొందిన ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం , రామకృష్ణలు సైతం ఆయన వీరాభిమానులే అని నేను ప్రత్యేకంగా చెప్పే అవసరం లేదు.

రామకృష్ణ గారు - మన దక్షిణాది సుమధుర గాయని, తెలుగు వారి, 'లతామంగేష్కర్' లాంటి పి. సుశీల గారి స్వంత సోదరి చిరంజీవి. అంటే పి. సుశీల రామకృష్ణ గారి 'పిన్ని' అన్న మాట.

20.08.1947న జన్మించిన 'రామకృష్ణ' చిన్నప్పటి నుంచీ సంగీత వాతావరణంలో పెరిగిన మనిషి.

విజయనగరంలో వారి తాతగారు పులిపాక ముకుంద రావు ఎంతో పేరున్న వైణిక విద్యాంసులు. కూతుళ్ళందరికీ సంగీతంలో మంచి ప్రవేశం కలిగించిన వారు. వారి మాతృమూర్తి, పితాశ్రీ వి. రత్నం, వి. రంగశాయి సంగీత సాధనలో రామకృష్ణ గారికి నేర్పిన దాని కన్నా ఆయన వినికిడి శక్తి ద్వారానే సాధించింది ఎక్కువ.

ఆటోగ్రాఫ్‌లు దొరకని గొప్పోళ్ళు...!

చాలా చాలా సంవత్సరాల క్రితం ముచ్చట.

ఘంటసాల గారి జ్ఞాపకాల గురించి రసాలూరు గీతాల గురించి ఎంతో ఆత్మీయంగా, చర్చ సాగుతోంది.

కొంత మంది యువకులు, ఘంటసాల అంటే పడిచచ్చే వందల వేల అభిమానులు ఆయన్ను ఎంత పిచ్చిగా ఆరాధించే వారో అనే జ్ఞాపకాలను విన్పిస్తూ ఉన్నారో చోట.

ప్రపంచంలో వేపకాయంత పిచ్చి ఉన్న వాళ్ళున్నారు. ఏకంగా వేప చెట్టంత పిచ్చి ముదిరిన వాళ్ళూ ఉన్నారు.

తన 'అభిమానుల' వీర పిచ్చి రకరకాలుగా ఉంటుంది.

ఒకసారి ఆయన్ను ఆటోగ్రాఫ్ గురించి ప్రాదేయపడ్డారు. ఘంటసాల గారు చాలా వినమ్ర స్వభావులు.

'కాదు'-'లేదు' అని చెప్పాలన్నా కాసేపు మౌనంగా ఆలోచించే తత్వం వారిది. ఆటోగ్రాఫ్ తీసుకునే వాళ్ళ తత్వం పూర్తిగా విరోధాభాసం కలిగి ఉంటుంది. మనం కూడా 'అభిమాన వీరాధి వీరులం' కాబట్టి మనకు ఆ విషయం గురించి బాగా తెలుసు.

ఆటోగ్రాఫ్‌లు ఎంత గమ్మత్తుగా, విచిత్రంగా ఉంటాయో రసికులకూ, పాఠకులకూ తెలియనివి కాదు.

మొదటి ఆటోగ్రాఫ్ చేసుకున్న 'సెలబ్రిటీ' తీసుకున్న 'అభిమానీ' ఇద్దరూ ఇద్దరే... ఎవరూ మరచిపోలేరు.

కొంత మంది ప్రత్యేకంగా 'ఆటోగ్రాఫ్ బుక్స్' లనే ఏరీ కోరీ కొనుక్కొని ఆటోగ్రాఫ్ వేట మీద విజృంభించి దండయాత్ర సాగిస్తారు.

టీ షర్ట్స్ మీదా, కర్చీఫ్‌ల మీదా, బ్యాట్స్ మీదా, బంతుల మీదా, అరిచేతుల మీదా, రూపాయి నోట్ల మీదా, - 'ఇందు గలదందు లేదన్న సందేహము వలదు ఎందెందు వెతికినను 'ఆటోగ్రాఫ్ అందే కలదు' అన్న చందాన మనం ఊహించని విధంలోనూ ఆటోగ్రాఫ్‌లు చేసిన వాళ్ళూ, పొందిన విచిత్ర అభిమానులూ ఉన్నారు ఈ వింత ప్రపంచంలో.

ఘంటసాలను కొంత మంది అభిమానులు ఇలాగే ఆటోగ్రాఫ్ కోసం చుట్టుముట్టారోసారి.

కొంతమంది నోటు పుస్తకాల మీద, కొందరు అందిన కాయితాల మీద, మరి కొందరు కాయితం ముక్కల మీదా 'ఆటోగ్రాఫ్'లు తీసుకుంటుంటే ఒక వీరాభిమాని సమయానికి ఏదీ అందుబాటులో లేనందున 'రెండు రూపాయల నోటు'ను ముందుంచాడు ఆటోగ్రాఫ్ కోసం.

ఘంటసాల గారు సున్నితంగా తిరస్కరించారు.

ఘంటసాల అభిమానుల్లో ఎవరు లేరనీ?

తెలుగు సినీ సంగీత రంగంలో ఆయన వారసులుగా పేరొందిన ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం , రామకృష్ణలు సైతం ఆయన వీరాభిమానులే అని నేను ప్రత్యేకంగా చెప్పే అవసరం లేదు.

రామకృష్ణ గారు - మన దక్షిణాది సుమధుర గాయని, తెలుగు వారి 'లతామంగేష్కర్' లాంటి పి. సుశీల గారి స్వంత సోదరి చిరంజీవి. అంటే పి. సుశీల రామకృష్ణ గారి 'పిన్ని' అన్న మాట.

20.08.1947న జన్మించిన 'రామకృష్ణ' చిన్నప్పటి నుంచీ సంగీత వాతావరణంలో పెరిగిన మనిషి.

విజయనగరంలో వారి తాతగారు

పులిపాక ముకుంద రావు ఎంతో పేరున్న వైణిక విద్యాంసులు. కూతుళ్ళందరికీ సంగీతంలో మంచి ప్రవేశం కలిగించిన వారు. వారి మాతృమూర్తి, పితాశ్రీ వి. రత్నం, వి. రంగశాయి సంగీత సాధనలో రామకృష్ణ గారికి నేర్పిన దాని కన్నా ఆయన వినికిడి శక్తి ద్వారానే సాధించింది ఎక్కువ.

తండ్రి గారి ఉద్యోగం 'మైన్స్ అండ్ జియాలజీ శాఖలో డైరెక్టర్' లాంటి బరువు బాధ్యతలున్నది. అందువల్లే 'చదువు' మీద శ్రద్ధ బాగా వహించేవారు. పదిహేనేళ్ళ ప్రాయంలో 'నేదునూరి కృష్ణమూర్తి' గారి దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నా - చదువు మీది ఒత్తిడి వల్ల 'సంగీత సాధన' అనతి కాలంలోనే అటకెక్కి, అక్కడే సుఖాసీనమై పోయింది.

వేసవి సెలవుల్లో రామకృష్ణ దండయాత్రలు మద్రాసులోని పిన్ని 'పి.సుశీల' గారి దగ్గరికే. పిన్ని పాటల రికార్డింగ్‌లను చూస్తూ, వింటూ అవలీలగా సెలవులు గడచిపోయేవి.

ఒక రోజు జెమినీ స్టూడియోలో ఎప్పటిలాగే పిన్ని వెంట రికార్డింగ్ చూద్దాం అని మరో దండయాత్ర సాగించిన సంగీత ప్రేమికుడు' రామకృష్ణకు అక్కడి ఆర్టిస్ట్ రూంలో వదులు జుబ్బా వేసుకొని, తెల్ల లుంగీ కట్టుకొని, తలపాగా చుట్టుకున్న ఒక 'పెద్ద మనిషి' తారసపడ్డాడు.

"ఆఁ ఎవరోలేఁ!' అని రామకృష్ణ గారు పట్టించుకోలేదు.

పిన్ని పి. సుశీల మటుకు ఎంతో గౌరవంగా నమస్కరిస్తే రామకృష్ణ గారికి ఉన్న ఫళంగా చెమటలు పట్టాయి.

ఆయన 'ఘంటసాల' అని ఏ మాత్రం వూహించలేకపోయాడు.

అంత గొప్ప మనిషి అంత సాదా సీదాగా, నిరాడంబరంగా ఉండగలుగుతాడని కల్లోనూ తట్టలేని రామకృష్ణకు కొన్ని క్షణాలేం మాట్లాడాలో అర్థం కాలేదు. నోరు తెరచి, కళ్ళప్పగించి చూస్తూ అప్రతిభుడై నిలబడి ఉండిపోయాడు. సుశీల గారే నవ్వుతూ మిగతా పని పూర్తి చేశారు.

-"మాష్టారు గారూ! వీడు మీ పిచ్చి అభిమాని... మా అక్కయ్య కొడుకు. కాలేజీ ఫంక్షన్స్‌లో మీ పాటలే పాడుతుంటాడు" అని ఘంటసాల గారితో పరిచయం చేస్తూ చెప్పారు.

ఘంటసాల నిరాడంబరంగా, ఆత్మీయంగా భుజం తట్టూ- 'చాలా సంతోషం బాబూ'! అనే పలకరింపును రామకృష్ణ జీవితాంతం మరచిపోలేక పోయారు.

ఘంటసాల ఆ పూట రికార్డ్ చేసిన గీతం.. పి. సుశీలతో గానం చేసిన "పిల్లనగ్రోవి పిలుపు" (శ్రీ కృష్ణ విజయం) లోని యుగళ గీతం.

రామకృష్ణ అదివరకే శ్రీ చిత్తరంజన్ సంగీత దర్శకత్వంలో ఎన్నో లలిత గీతాలు యువవాణి 'రేడియో కార్యక్రమాల్లో' విన్పించి ఉన్నారు. కాలేజి ఫంక్షన్‌లో ఎన్నో గీతాలు గానం చేసి ఉన్నారు.

1972లో బియస్సీ చదివే రోజుల్లో ఒక అపూర్వ అవకాశం వచ్చింది. సారథీ స్టూడియోలో కుటుంబ నియంత్రణ కార్యక్రమం తాలూకు పాటలు పాడే అవకాశం ఉంది. కె.బి.కె. మోహన రాజు అస్వస్థత వల్ల ఆ అవకాశం రామకృష్ణకు లభించడం... ఆయన గానం చేస్తుంటే మన అందాల హీరో 'నాగేశ్వర రావు' గమనించడం ఒక రకంగా మనం చేసుకున్న అదృష్టం.

'విచిత్ర బంధం'లో తొలి పాట రికార్డ్ చేసుకున్నారు రామకృష్ణ గారు. మద్రాసులో 1973 మే నెలలో (జెమినీ స్టూడియో) కేవీ మహదేవన్ సంగీతంలో, పి. సుశీలతో కలిసి పాడిన తొలి గీతం - 'వయసే ఒక పూల తోట'. అదే చిత్రం కోసం గానం చేసిన మరో సోలో గీతం 'చిక్కావు చేతిలో చిలకమ్మా' ఆ రోజుల్లో యువతరాన్ని ఒక వూపు ఊపిపారేసింది.

తొలి గీతాలే అందాల హీరో 'అక్కినేని' కోసం గానం చేయడం, అవి ఎంతో ప్రజాదరణ పొందటం ఆయన అదృష్టం, మన ప్రాప్తం.

ఘంటసాల ఆత్మీయంగా ప్రోత్సహిస్తూ- 'మనం పాడే పాట ముఖ్యం కాదు బాబూ! సంగీత దర్శకుడి బాణీని, సాహిత్యాన్నీ అవగాహన చేసుకొని, కవి భావాలను శ్రోతలకు అందించడం ముఖ్యం. మాటలనూ, భావాలను విభజించి పలికించడం సినీ సంగీత గానం ప్రాథమిక స్వరూపం. అదే అసలు సిసలైన ఎక్స్‌ప్రెషన్' లాంటి బంగారు సూత్రాలను సలహాల రూపంలో అందించేవారు.

'కరుణామయా దేవా'... (భక్త తుకారాం)
'మనసు లేని దేవుడు'.... (ప్రేమలూ, పెళ్ళిళ్ళూ)
'తెలుగు వీర లేవరా'... (అల్లూరి సీతారామ రాజు)
'శ్రీమతి గారికి తీరని వేళ...(శారద) అలా రూపుదిద్దుకున్న అందాల గీతాలే!

రామకృష్ణకు ఘంటసాల ఎడల ప్రేమాభిమానాలూ, ఆదరాభిమానాలు, స్వయంగా స్వయం ప్రతిభ ఉన్న గాయకుడైనా చాలా ఎక్కువ.

ఘంటసాల మరణించిన కొన్నాళ్ళకు ఆయన రాజమండ్రిలో ఒక ప్రైవేట్ కచేరిలో పాల్గొనడానికి వెళ్ళారు. మధ్యలో ఒక గుడి దగ్గర కొంత మంది భక్తులు గుమిగూడి 'ఘనాఘన సుందరా' అని పాట గానం చేస్తూ, మరో వైపు ఘంటసాల గారిని తలచుకుంటూ భోరున విలపిస్తున్న దృశ్యం చూసి కదిలిపోయారు.

అక్కడే ఉన్న ఒక మిమిక్రీ కళాకారుడు స్వంత ఖర్చులతో ఘంటసాల పేర్న పాటలు పోటీలు నిర్వహించే వాడు. సీతారామ్ ఆయన పేరు. ఎవరి సహాయ సహకారాలూ, ఆయన స్వీకరించే వాడు కాదు. అవసరం వస్తే భార్య నగలైనా తాకట్టు పెట్టి కార్యక్రమం కొనసాగించేవాడు కాని, వెనక్కి తగ్గేవాడు కాదు. గమ్మత్తేమిటంటే అంతటి అరుదైన అభిమాని నిజ జీవితంలో ఘంటసాల గారిని ఫోటోల్లో తప్ప ప్రత్యక్ష్యంగా చూడలేదట. ఇవన్నీ చిత్ర విచిత్రాలు కాక మరేమిటి?

రామకృష్ణ కూడా సినీ సంగీత పరిశ్రమలో కాలిడిన రోజు నుండి ఘంటసాల గారితో కలిసి ఒక్క ఫొటో కూడా తీసుకొని దాచుకోలేకపోయారు.

అమెరికాలోని డెట్రాయిట్ నగరంలో ఒక డాక్టరు దశాబ్దంన్నర సంవత్సరాల క్రితం ఘంటసాల గారి ఆటోగ్రాఫ్‌ను ఒక కెనడా డాలర్ నోట్ మీద తీసుకున్నారట.

రామకృష్ణ గారికి ఆ సంతకం.... ఒక ఫొటో ఆయన బహూకరించాడు. తెలుగు వెలుగుల సినీ సంగీత సృష్టిలోనే కలిసి మెలిసి ఉన్న వాళ్ళు ఎక్కడో డెట్రాయిట్ నగరంలోని అభిమానుల వల్ల తన చిరు కోరికలను పూర్తి చేసుకోగలిగారు. అదీ ఓ విచిత్రం కాక మరేమిటీ!

పెండ్యాల, కేవీ మహదేవన్, సుసర్ల దక్షిణామూర్తి లాంటి హేమాహేమీల దగ్గర సంగీతంలోని అరుదైన అపరూప సృష్టి నందించకలిగిన రామకృష్ణ ఎన్నో అందమైన గీతాలను తెలుగు రసికులకందించారు.

"శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, అందాల రాముడు, మహాకవి క్షేత్రయ్య, ముత్యాల ముగ్గు" చిత్రాల్లో పాటలను ఒకసారి తలచుకుంటూ డా॥ ప్రకాశ్ ఆప్టేగారి 'హేమలకాసా' అడవుల్లోని విడిదిలో తిరుగుతున్నప్పుడు మా గుంపులోని మిత్రులందరం అర్థరాత్రి చలి మంటల చుట్టూ ప్రోగై పాత తెలుగు సినీ గీతాలను చెక్క బల్ల మీద దరువులేస్తూ పాడుకుంటుంటే- ఆ ప్రాంత మరాఠీ వాళ్ళు నాట్యాలు చేస్తూ మురిసిపోయారు.

'ఏ తో ఘంటసాలా జీ కా గానాహై' (ఓహో ! ఇది ఘంటసాలా గారి పాట కదండీ!) అని ఒక్క క్షణం ఆగి, జేబులన్నీ వెదికి ఓ కాయితం ముక్క తీసి 'సర్! ఆటోగ్రాఫ్ ప్లీజ్' అని అడిగిన అడవి మిత్రుడిని చూసి మాకు కళ్ళు చెమర్చాయి.

ఘంటసాల గారు రెండు రూపాయల మీద సంతకం చేయలేక తల్లడిల్లి ఉండొచ్చు. డెట్రాయిట్ లో డాలర్ నోట్ మీద రఫీమని సంతకం పెట్టి ఉండొచ్చు. కాని, ఆ మహనీయుడు అడవిలోనూ చిరస్మరణీయుడయ్యాడు. రామకృష్ణగారికి డెట్రాయిట్‌లో ఘంటసాల 'ఆటోగ్రాఫ్' నోట్ దొరికింది. అర్థరాత్రి 'బస్తర్' ప్రాంతంలో ఆటోగ్రాఫ్ అడిగిన మిత్రుడు, చేసిన మేమూ... ఇలాంటి వాళ్ళున్నన్ని రోజులు మన సంగీతం వెన్నెల్లో తారకల్లా మెరుస్తూనే ఉంటుంది. వెలుగుతూనే ఉంటుంది మరి.

❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.

ఫోన్ : 08732223622

ఐ.పి అప్పులు సెటిల్ చేసేదెలా!

నేను 1986వ సంవత్సరంలో ఒక చిట్‌ఫండ్ ఫైనాన్స్ కంపెనీ స్థాపించాను. ఆనాటి నుండి 15 సంవత్సరాల వరకు వ్యాపారం బాగా సాగింది. 2001 సంవత్సరం నుంచి రావలసిన డబ్బులు సమయానికి రాకపోవటం వలన వ్యాపారం నష్టాల బాట పట్టింది. నేను ఇవ్వవలసిన వారు వడ్డీతో సహా ఇవ్వమని అడుగుతున్నారు. కానీ నాకు ఇవ్వాల్సిన వారు అసలు కూడా ఇవ్వక పోవటంతో కంపెనీ 2002లో మూసివేశాము. తర్వాత రావాల్సిన సొమ్ము గురించి కోర్టులో వేశాం. ఇప్పటికీ కోర్టులో దావాలు వేసి ఆరు సంవత్సరాలైంది. కానీ ఎటువంటి ప్రయోజనం లేదు. ఐ.పి. నెం. వచ్చినప్పటికీ డబ్బులు వసూలు కావటం లేదు. కార్డ్ సెటిల్‌మెంట్ ద్వారా అసలు (1,15,000/-లకు 1,00,000/-) ఇస్తానంటున్నారు. లేకుంటే కేసు నడిపించుకొమ్మని అంటున్నారు. ఇప్పటికి ఇలా 67 లక్షల రూపాయల బాకీలు తీర్చాను. గత నాలుగు సంవత్సరాల నుండి ఏ కేసు వసూలు అవ్వటం లేదు. నేను ఇవ్వవలసిన వాళ్ళు ఆగటం లేదు. నేను ఇవ్వవలసిన వాళ్ళ వలన ఇది వరకు పోలీసులతో కూడా చాలా ఇబ్బంది పడ్డాను. ప్రస్తుతం నాకు ఎటువంటి ఉపాధి లేదు. కోర్టులో దావాలు వేయటానికి వాటి స్టాంపు ఖర్చులకు కూడా చాలా ఇబ్బందిగా ఉంది. నేను ఉపాధి కోసం ఊరు వదిలి వెళ్లామనుకుంటున్నాను. కానీ ఈ అప్పుల వల్ల వెళ్ళలేకపోతున్నాను. నాకు రావాల్సిన వారి నుండి నేను ఇవ్వవలసిన వారికి సెటిల్ చేయవచ్చా? ఇది వరకు చాలా మంది ఐ.పి. పెట్టమని సలహాలు ఇచ్చారు. కానీ ఐ.పి. పెట్టి మోసం చేయలేక పెట్టలేదు. ఐ.పి కాక ఇంకా దేని ద్వారా నైనా సెటిల్ చేయవచ్చా? ఒక వేళ చేయవస్తే దాని గురించి వివరంగా తెలుపగలరు.?

యాదగిరి, (ఊరుపేరు రాయలేదు).

మీరు గత ఆరు సంవత్సరాల నుండి కోర్టు కేసులు నడిపిస్తున్నారు. అవన్నీ ఐపి స్టేజిలో ఉన్నవి. కావున ఇంకొద్దిగ గట్టిగా... కేసులు వాయిదాలు పడకుండా ప్రయత్నిస్తే మీకు డబ్బులు వస్తాయి. అలా కానట్లయితే మీరు ఇవ్వవలసిన వారు, మీకు ఇవ్వవలసిన వారు కోర్టు పరంగా ఒక దావా వేయాలి. అంతకు మించి వేరే మార్గం లేదు. అది మీకు ఇష్టం లేనట్లయితే కోర్టు బయట ఇరు పక్షాలను సమీకరించి ఒప్పందాలు చేయించుకోవలసి ఉంటుంది. ఇదికాక వేరే మార్గం లేదు.

ఆ డబ్బులు అందాలంటే...

నేను పీర్లెస్ డిపాజిట్ చేశాను. కాలపరిధి ముగిసిన తరువాత వారు రూ 4160/- చెక్కు పంపారు. దానిని సిండికేట్ బ్యాంక్‌లో నా అకౌంట్ కింద జమ చేయడానికి ఇచ్చాను. వారు చెక్కును కాలపరిమితి ముగిసిన తరువాత ఇది వేరే బ్యాంక్ మీద వుందని తిప్పి పంపించారు. ఆ చెక్కును పీర్లెస్ హైదరాబాద్ -20 వారు పంపినారు. అప్పటి నుండి ఇంత వరకు వారు నా డబ్బును వాపసు చేయలేదు. ఎన్ని పర్యాయాలు ఉత్తరాలు, ఫోన్ల ద్వారా అడిగినా మాట్లాడలేదు. ఆ డిపాజిటుకు సంబంధించిన వివరాలు నావద్ద ఏమీ లేవు. సర్టిఫికెట్ నంబర్ వగైరా వారు మొదటగా పంపిన చెక్ ఫొటో జిరాక్స్ కాపీ తప్ప ఏమీ లేవు. మూడు సంవత్సరాలు గడిచాయి. నా సమస్యకు పరిష్కారం చూపగలరు.

యర్రంశెట్టి కోటేశ్వరమ్మ, నల్లచెర్వు, గుంటూరు.

మీకు సంబంధించిన పత్రాల జిరాక్స్ కాపీలు మీకు రావలసిన డబ్బుకు సంబంధించిన పత్రాలు అన్నీ ఉంటేనే మీరు కన్స్యూమర్ ఫోరంలో వేసుకునే వీలుంటుంది. అటువంటి పత్రాలు ఏమీ లేకుండా ఏ కోర్టు ఫోరం డబ్బులు ఇప్పించలేదు.



పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజే యండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది,
9848994240







అన్ని పప్పులతో పొడి

కావలసిన పదార్థాలు

కందిపప్పు-1 కప్పు, పెసరపప్పు-1 కప్పు, శనగపప్పు-1 కప్పు, మినపపప్పు-1 కప్పు, మిరపకాయలు-2 గుప్పెళ్ళు, వెల్లుల్లి గర్భాలు -4, జీలకర్ర- 1/2 కప్పు ఉప్పు - సరిపడా

తయారు చేసే విధానం

మిరపకాయలు బాగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అలాగే పప్పులన్నీ రాళ్ళు లేకుండా శుభ్రం చేసి దోరగా వేయించుకోవాలి. ఇవి అన్ని కలిపి మిక్సీలో వేసి గాని, తిరగలితో గాని, మెత్తగా పొడుం చేసి సీసాలో పోసుకోవాలి. పొడుం అన్నంలోకి, ఇడ్లీలోకి బాగుంటుంది.

నూడుల్స్

కావలసిన పదార్థాలు

నూడుల్స్- 1 పాకెట్, నూనె- 2 టీస్పూన్లు, ఉప్పు-తగినంత, క్యారట్ తరుగు- 1 కప్పు, క్యాబేజి తరుగు- 1 కప్పు, కాప్సికమ్ చక్రాలు -1 కప్పు ఉల్లి తరుగు, లేదా ఉల్లికాడల తరుగు- 1 కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- 1 టీ స్పూన్, మిరియాల పొడి-1/2 టీ స్పూన్, సోయాసాస్- 2 టీ స్పూన్లు చిల్లీసాస్- 1/2 , టీ స్పూన్ వెనిగర్- 1 టీ స్పూన్.

తయారు చేసే విధానం

నూడుల్స్‌ను ఉడికించి, చల్లని నీళ్ళు వేసి తీసి జల్లెడలో వేసి ఉంచాలి. నూనె బాండీలో వేడి చేసి, వెల్లుల్లి పేస్ట్‌ని, ఉల్లి చక్రాలను వేసి వేయించి క్యారట్స్, ఉప్పు, మిరియాల పొడి వేసి రెండు నిమిషాలు ఉడికించి, క్యాబేజీ తరుగు వేసి, కాప్సికమ్ చక్రాలను వేసి ఐదు నిమిషాలు ఉడికాక నూడుల్స్ వేసి, వెనిగర్‌ను సోయాసాస్‌ను వేసి చిల్లీసాస్‌ను కూడా వేసి మిక్స్ చేసి ఐదు నిమిషాలు ఉడికించాలి. మంచూరియాతో వేడిగా వడ్డించాలి.



నిమ్మ షర్బత్

కావలసిన పదార్థాలు

నిమ్మ పండ్ల రసం- 1 గ్లాసు, నీరు - 1/2 గ్లాసు పంచదార- 4 గ్లాసులు, ఉప్పు- టీ స్పూను

తయారు చేసే విధానం

నిమ్మకాయలు శుభ్రంగా కడిగి తుడిచి రసం తీసి ముత్యాలు రాకుండా వడ పోసి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో పంచదార, నీరు పోసి స్టౌ మీద పెట్టి తీగ పాకం వచ్చేదాకా ఉంచాలి (తీగ పాకమంటే ప్లేటులో నీరు పోసి పాకం కొంచెం నీటిలో వేస్తే ఆ పాకం దగ్గరకు తీస్తే ముద్ద అవ్వాలి). నిమ్మరసంలో ఉప్పు వేసి కలియబెట్టి పాకం కూడా పోసి ఒక తిప్పు తిప్పి దింపాలి. చల్లారిన తరువాత సీసాల్లో పోసుకొని ఒక గ్లాసు నీళ్లకు రెండు స్పూన్లు షరబత్ కలిపితే సరిపోతుంది. దీనిలో కొంచెం సోడా ఉప్పు, ఐస్ ముక్క వేసి కలిపితే లైమ్ టేస్ట్ వస్తుంది.



మహారాజా చికెన్

కావలసిన పదార్థాలు

చికెన్ - 1/2 కిలో (1/2 కన్నా కొంచెం తక్కువగా ఉండేలా చూసుకోవాలి) తాజా క్రీమ్ - 150 గ్రాములు, టొమేటో గుజ్జు (గింజలు తీసినది) 200 గ్రాములు, వెన్న- 50 గ్రాములు, అల్లం- 1 అంగుళం ముక్క వెల్లుల్లిపాయలు- 1, గరమ్ మసాలా - 1 టీ స్పూన్, పసుపు- చిటికెడు, ఎరుపు రంగు / ఉడ్ కలర్- కొద్దిగా, పెరుగు- కొద్దిగా

తయారు చేసే విధానం

అల్లం, వెల్లుల్లి నూరి ముద్ద చేసుకోవాలి. పెరుగులో అల్లం, వెల్లుల్లి ముద్దను, గరం మసాలా పొడిని, పసుపును, రంగును కలపాలి. కోడిని బాగా కడిగి శుభ్రం చేసి ఈ మిశ్రమాన్ని బాగా పట్టించి రెండు గంటలపాటు బాగా నానబెట్టుకోవాలి. బొగ్గుల కుంపటిలో నిప్పులు వేసి, ఊరిన కోడిని, ఆ సెగలో బాగా ఉడికేలా అన్ని వైపులా తిప్పుతూ కాల్చండి. చక్కగా కాలిన తర్వాత, ఎముకలన్నీ ఆ కోడి నుండి తీసి వేయండి. బాణలిలో వెన్నను వేసి అందులో టొమేటో గుజ్జు, తరిగిన కొత్తిమీర, తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పును చేర్చి చక్కగా ఉడికేలా ఐదు నిమిషాలు ఉంచండి. దానికి ఎముకలు తీసివేసిన కోడిని చేర్చి, దానిపై క్రీమ్‌ను చల్లి నెమ్మదిగా ఆ మిశ్రమం కోడికి అంతా అయ్యేలా చేసి, సన్నని సెగపై చిక్కగా ఉడికేలా వేపండి.

రొట్టెలతో గానీ, అన్నంతోగాని ఇది చాలా బాగుంటుంది.

నిగ్రహ ఆవేశం 'మొలక'

వర్తమాన సాహిత్య లోకంలో బహుముఖీనంగా సాగే కవితా ప్రస్థానంలో ఒక నిబద్ధతను ప్రదర్శిస్తున్న కవి ఆనందాచారి. సుదీర్ఘకాలంగా కవిత్వ రచన సాగిస్తున్న ఆనందాచారి మొదటి కవితా సంకలనం "మొలక". తన ఆలోచనలను కవిత్వ మొలకలుగా తీర్చిదిద్ది సమాజ పుస్తకంలో నాట్లు వేస్తున్నాడు. పుస్తకంలోని ఇతర కవితల జోలికి వెళ్ళేముందు కవి తాత్విక పునాది గురించి ప్రస్తావించుకోవడం సముచితం. మొలక భావనలో వినయం, తాజాతనం, కొత్త తరం స్ఫురిస్తాయి. కేవలం సాటి మనిషిగా ఇతరుల కష్ట సుఖాలకు మానవతా దృక్పథంతో స్పందించడానికి మించి ఒక మౌలిక దృక్పథంతో ఈ కవి తన కవిత్వం విన్పిస్తాడు. 'నేల పొరల్లో/రెక్కల పోగుల్ని రాల్చుకున్న మట్టిగుండె/తన నీడను వెతుక్కుంటూ/వెళ్ళిపోతోంది!/బ్రతుకు పంటలన్నీ పాముల నోట్లో పడ్డ/ వైకుంఠపాళీ ఆటై/ రోడ్డున పడ్డ పెళ్ళాం పిల్లలు/ పిల్లలూ పెళ్ళాం../ అంతా మిథ్యయితే ఎంత బాగుండు!"(మరణ రికార్డుల పైనుండి). వర్తమాన నాగరిక అభివృద్ధి రైతుకు రక్షణ ఇవ్వలేని పరిస్థితిలో రైతు ఉరికొయ్యకు వ్రేలాడుతున్నాడు. రైతు దుస్థితిని పరిమిత వాక్యాల్లో దృశ్యం కట్టించిన తీరు కవి ప్రావీణ్యతకు అద్దం పడుతుంది. సమాజం మొత్తం ఒక ప్రగతి మార్గాన అభివృద్ధివైపు సాగాలనే భావన ఆనందాచారి కవిత్వం నిండా ఉంటుంది. సమాజంలోని పలు సమస్యలను ప్రస్తావించిన కవి మహిళలు, పిల్లలు, రైతులు, శ్రామికులు గురించి కొన్ని కవితలను నిర్దిష్టంగా రూపొందించాడు. ప్రతీ సమస్యని కవి ఒక మౌలిక దృక్పథంతో పాఠకుడి ముందుకు తీసుకువస్తాడు. సంఘం ఏర్పాటులో బతుకులన్నీ పెనవేసుకున్నవే. వాటిలో వెతల్ని తొలగించాలి కానీ, బంధాల్ని తెంచకూడదు అనే ఆశావహ ధోరణి కవిత్వమంతా పరుచుకుని ఉంటుంది. ఒక శాస్త్రీయమైన సమగ్ర దృష్టితో పాటు కవికి ఉన్న నిగ్రహ ఆవేశం వల్ల ఇది సాధ్యమయింది. నిర్లక్ష్యంగా ఇతరుల కోసం కవి రాసి పారేశాడు అన్న ఆలోచనకే అవకాశం లేకుండా ప్రతీ కవితలో కవి అంతర్లీనంగా బాధ్యత వహిస్తూ దర్శనమిస్తుంటాడు. "గుండెల్ని పిండిన వాస్తవాలు/మనసును తొలుస్తున్నప్పుడు/ అక్షరాలు శబ్దించడం మాని/ మౌనంగా రోదిస్తున్నాయి/అమానుషత్వానికి అద్దం పట్టలేక/ కవిత్వం సిగ్గుతో తల దించుకుంది (పేలుతున్న గీతం) అంటాడు. పూర్తిగా బాధ్యత వహించే కవి వాక్యాలు ఇవి. నేడున్న పరిస్థితుల్లో కవి విడి విడి చైతన్యం ప్రదర్శిస్తే సరిపోదు. ఒక సామూహిక చైతన్యంగా కవి ప్రయాణించాలి. దానికి నిలువెత్తు ప్రతీక ఆనందాచారి. ఈ కాలపు ధోరణులకు భిన్నంగా ఒక సమగ్రతకు, నిబద్ధతకు మద్దతు పలికిన కవిత్వం 'మొలక'. ఈ మొలక పచ్చని చెట్టై విస్తరించాలని ఆశిద్దాం.

మొలక, కె. ఆనందాచారి

వెల: 50/-, పేజీలు150, ప్రతులకు: ప్రజాశక్తి, బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, కె. ఆనందాచారి, ఇం.నెం. 11-10-740/18, బుర్హన్‌పురం, ఖమ్మం- 507 001

-వారి ప్రసాద్



తెలంగాణ రాష్ట్ర

ఉద్యమంలో మలుపులు

తెలంగాణ 8వ పుస్తకం

బి.ఎస్. రాములు

వెల:30/-, పేజీలు:79

ప్రతులకు: బి.ఎస్. రాములు, 406, ఉషాకిరణ్ ఆర్కేడ్, ఉస్మానియా యూనివర్సిటీ రోడ్, హైదరాబాద్.

యు.పి.లో

బిఎస్‌పి గెలుపు

బి.ఎస్. రాములు

సంపాదకులు: తులసి సంపత్ కుమార్

వెల:40/-, పేజీలు:128

ప్రతులకు: సహచర, సమాంతర దళిత బుక్ సెంటర్, లక్డీకపూల్, హైదరాబాద్,



అనువాదకులకు కరదీపిక



తొలి తరం అనువాదకులకు, నేటి అనువాదకులకు భాషలోను, భావ వ్యక్తీకరణకు ఉపయోగించే భాషా సరంజామా కూర్పులోను ఎంతో మార్పు కన్పిస్తుంది. ఏది ఏమైనా అంతిమ లక్ష్యం తన వారికి పరభాషా సాహిత్యాన్ని దానితో పాటు సాహిత్య వాతావరణాన్ని విలువల్ని, సంప్రదాయాలను, సంస్కృతినీ పరిచయం చేయడమే. ఆ ప్రక్రియలో అనువాదకుల కృషి మరువలేనిది. ఈ కృషి నాటి నుండి నేటి వరకు నిరాఘాటంగా సాగుతూనే ఉంది. ఇదిగో అట్లాంటి వారి కోసమే ఆంధ్ర సారస్వత పరిషత్తు హైదరాబాద్ వారు 'సాహిత్యానువాదం సమాలోచనం' అన్న పుస్తకాన్ని అందించారు. సాహిత్య అనువాదాల్లో పేరు పొందిన ఎనిమిది మంది సృజనాత్మక, కళాకత్మక, వ్యాసాలతో దీన్ని తీసుకొచ్చారు.

దాశరథి, సి.నా.రె.ల కృషి... మరి కొందరి ఆసక్తి వల్లే తెలుగు సాహిత్యానికి ఉర్దూ గుబాళింపులు పరిచయమయ్యాయి. ఉర్దూ, పార్సీ, ఆంగ్ల భాషలతో సాన్నిహిత్యం ఈ సాహిత్యం వల్ల వచ్చిందే. అసలు తెలుగు సాహిత్య వికాసమే అనువాదంతో ఆరంభమైంది. సంస్కృత సాహిత్యాన్ని ఆంధ్రీకరించిన నాటి అనువాద యుగం నుండి నేటి అరుంధతీరాయ్ ప్రసంగాల అనువాదం దాకా తెలుగు సాహిత్య అనువాదంలో అనేక మార్పుల్ని ఈ పుస్తకంలోని వ్యాసాలు తడిమాయి. కొత్తగా అనువాద ప్రక్రియను చేపట్టాలనుకునే వారికిదొక కరదీపిక. ప్రాథమిక సమాచారంతో పాటు అనువాదపు ప్రక్రియలోని మెళకువల్ని సూచించారు. "అనువాదకుడికి అభివాదం" అన్న వ్యాసంలో "ఒక సమాజ సంస్కృతి, నాగరికత, కళాత్మక దృక్పథం.... ఆ సమాజ సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. అనువాదం కూడా వీటిని ప్రతిబింబించాల్సి ఉంటుందన్న" డా॥ చంద్రశేఖర రెడ్డి అభిప్రాయం అక్షరాలా ఆచరించదగ్గది. డా.పి. చంద్రశేఖర 'నాటకానువాదం ఒక పరిశీలన" వ్యాసం అనువాదకులకు డిక్షనరీ లాంటిది. ఆంగ్ల సాహిత్యాన్ని, పలువురి అనువాదాల్లోని వైరుధ్యాల్ని తులనాత్మకంగా వివరించడం ఉపయోగకరంగా ఉంది. శ్రీశ్రీ కవిత్వంలోని అనువాదాలకు లొంగని దేశీయ పదాల్ని, నడకనీ, వివరిస్తూ ఒక భాషలోని లయ, గతి ధ్వని వంటి ప్రత్యేకాంశాల్ని లక్ష్యభాషలోకి మార్చేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తను సజాత పట్వారి వ్యాసం తెలియజెప్పిన విధానం పాఠకుల్లో ఆసక్తితో పాటు ఆలోచనల్ని రేకెత్తిస్తుంది. ఇంకా ఈ పుస్తకంలో లక్ష్మి హరిబండి, డా॥ భక్తావత్సలరెడ్డి, డా॥ కె.బి. లక్ష్మి, ఆచార్య భార్గవి, పి.వి. రావు వంటి వారి అమూల్యమైన విశ్లేషణలు, కొత్తవారికి పలు సూచనలూ ...ఉన్న విషయ సంపదను పాఠకులకందించిన ఆంధ్ర సారస్వత పరిషత్తును అభినందించాల్సిందే. పుస్తకానికి ప్రధాన సంపాదకులుగా ఉన్న ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డా. సి. నారాయణ రెడ్డి గారి కృషి, దూరదృష్టి ఎంతో అభినందనీయం.

సాహిత్యానువాదం సమాలోచనం

ప్రధాన సంపాదకులు: డా॥ సి. నారాయణ రెడ్డి, సంపాదకులు: ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, వెల: 60/-, పేజీలు:92, ప్రతులకు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, హైదరాబాద్.

- సైదులు ఐనాల

కోతుల పెళ్లికి అందరూ పెద్దలే

అక్కడ బోలెడంత మంది అతిథులు. చాలా ఉత్సాహంగా ... ఆనందంగా వున్నారు. అంతా మేళ తాళాలతో...పెళ్లి కుమారుడు 'మను'కు స్వాగతం పలికారు. పెళ్లి కుమార్తె 'జుమురి' తరపు బంధువులు మాత్రం తక్కువ తిన్నారా? భాజా భజంత్రీలతో వచ్చారు. అయితే పెళ్లికుమార్తె మాత్రం ఏ మాత్రం సిగ్గు పడడంలేదు. పెళ్లికుమారుడిని ఆటపట్టించసాగింది. ఆమెకు ఎరుపురంగు చీర కట్టారు. మొహాన సువాసనలు వెదజల్లుతున్న పౌడర్ పూశారు.

ఇంతకీ పెళ్లి కుమారుడికి ఎన్నేళ్లనుకున్నారు? జస్ట్ మూడేళ్లే. కొంపదీసి ఇది బాల్య వివాహం అనుకుంటున్నారా! కానేకాదండి. అసలు ఇది మనుషుల పెళ్లి కాదు. కోతుల పెళ్లి. ఈ శుభకార్యానికి మూడువేల మంది హాజరయ్యారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో వేదపండితుల ఆధ్వర్యంలో కోతుల పెళ్లి జరిగింది. ఇంతకీ ఎక్కడనుకుంటున్నారు? ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌కి 200 కిమీ దూరానున్న ఒక గ్రామంలో. కాకపోతే వాటి యజమానులు మాత్రం పెళ్లి అయ్యాక వాటికి స్వేచ్ఛ ప్రసాదించి వదిలిపెట్టేశారు. మొత్తానికి కోతి దంపతులకు పెళ్లి బాగానే కలిసివచ్చింది.

ఇదిగో ఇదే చివరిసారి చెప్పడం. ఇంకోసారి నా ఏరియాలోకి అడుగుపెట్టావో... తిత్తి తీస్తా...

బొట్టు బాగా పెట్టుకున్నానా...

పొరపాటున కూడా నా కళ్లల్లోకి సూటిగా చూడొద్దు. చూశారో అయి పోతారంతే.

కన్నా! మమ్మీ స్నానం చేయించలేదా! నేను శుభ్రం చేస్తాగా!!

గ్లాసులో బాగా కూర్చున్నానా! మరి ఫొటో తీయొచ్చుగా.

హాలో... ఎవరండీ లోపల?!

అమ్మా చూడవే ఈ నంగనాచి నన్ను గిచ్చి నవ్వుతోందే...



ఆఫ్టాల్ ఈగవి నువ్వు! నా ముక్కు మీద వాలతావా? నీ అంతు చూస్తా వుండు.



తీర్పు

చూటీ

చాన్నాళ్ల కిందటి సంగతి. అప్పుడు బాగ్దాద్‌లో ఒక కట్టెలుకొట్టే వ్యక్తి వుండేవాడు. పేరు రహీం. అతను ప్రతి రోజూ గాడిదమీద అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకొచ్చి అమ్ముకునేవాడు. అదే అతని జీవనాధారం. దాని మీద వచ్చే డబ్బుతోనే కుటుంబాన్ని పోషించేవాడు. ఎప్పటిలాగే ఆరోజుకూడా అడవికి వెళ్లి బాగా చేవ వున్న కట్టెలు కొట్టుకొని గాడిదమీద వేసుకొని వచ్చాడు. వాటిని ఎవరికైనా లాభసాటిగా అమ్మి మంచి బియ్యం కొనుక్కుని వెళ్లాలన్నది అతని ఆశ.

గాడిద మీద కట్టెలు వేసుకొని అలా నగరంలో వెళ్లసాగాడు. అదేంటోగానీ ఒక్కరుకూడా 'కట్టెలు ఎంత బాబు?' అని అడిగిన పాపాన పోలేదు. అలాగని వాటిని ఇంటికి మోసుకెళ్లలేడుకదా. అందుకే తనే అడగసాగాడు. ఎవ్వరూ కొనలేదు. ఒక మంగలిషాపు దగ్గరకెళ్లి "ఏవండీ! మంచి చేవగల కట్టెలున్నాయి నా దగ్గర. బాగా నిలబడి కాలతాయండీ. రెండు కట్టెలతోనే వంటంతా అయిపోతుందండీ....' అన్నాడు.

షాపు యజమాని కట్టెలు చూశాడు. బాగానే వున్నాయనిపించింది. కానీ అంతలోనే అతని మనసులో దుర్బుద్ధి పుట్టింది.

'ఎంత?' అన్నాడు.

'గాడిద మీద వున్న కట్టెలన్నీ ఐదు దినారాలు'

'సరే దించు...'

కట్టెలన్నీ షాపు ముందర గోడ పక్కన వేశాడు రహీం. డబ్బుల కోసం చెయ్యి చాచాడు.

యజమాని నవ్వుతూ...'అదేంటీ? గాడిదమీద వున్న కట్టెలన్నీ అన్నావు కదా. మరి కట్టెలమోపు నిలబడడానికి గాడిదమీద వున్న చెక్కబల్లను ఇవ్వవే...?' అనడిగాడు.

"అదేంటయ్యా! మీరు పెద్దమనిషై వుండీ...అలా మాట్లాడుతున్నారు? నేను అదెలా అమ్ముకుంటానండీ" అన్నాడు.

"నువ్వు చెప్పినదేకదా. గాడిదమీద వున్నకట్టెలన్నీ ఐదు దినారాలన్నావు...ఇది కూడా కట్టెలతో చేసినదేకదా...." అన్నాడు.

'అన్యాయం భాయ్‌సాబ్...ఏ పెద్దమనిషైనా సరే నా మాటే మాట్లాడతాడు' ఉడుక్కుంటూ అన్నాడు రహీం.

'అయితే పద మరి. న్యాయస్థానానికి వెళ్దాం' అన్నాడు.

ఇద్దరూ కలిసి న్యాయమూర్తి దగ్గరకెళ్లారు. ఆయన వీరి మాటలు విన్నాడు. చివరికి రహీం దగ్గరికెళ్లి కన్నుగీటి... చెవిలో ఏదో గుసగుసలాడాడు. తర్వాత పెద్దగా...

"అవును రహీం. మంగలిషాపు యజమాని చెప్పింది నిజమే. నువ్వు గాడిద మీద కట్టెలు పెట్టడానికి ఉపయోగించే చెక్కబల్లను కూడా అతనికే ఇచ్చేయ్. అప్పుడు అతను నీకు ఐదు దినారాలు ఇస్తాడు" అని తీర్పు చెప్పాడు. అందుకు అనుగుణంగానే ఇద్దరూ చేశారు.

❖ ❖ ❖

ఒక రోజు రహీం మంగలిషాపుకు వెళ్లాడు. హాయిగా కుర్చీలో కూర్చుని ...'జీ! నాకు, బయట వున్న నా దోస్తుకు షేవింగ్ చేయాలి. ఎంత తీసుకుంటారు' అన్నాడు.

"ఇద్దరికీ ఒక దినార్ ఇవ్వు"

"ఐతే ముందు నాకు షేవింగ్ చెయ్యండి"

షేవింగ్ చేస్తూ...." ఇంతకీ మీ మిత్రుడు ఏం చేస్తుంటాడు?" అనడిగాడు షాపు యజమాని.

"ఎప్పుడూ నావెంటే వుంటాడు జీ. నేనంటే ఎంత అభిమానమో...నాకు ఎప్పుడూ సాయంగా వుంటాడు"

"స్నేహమంటే అలా వుండాలి... ఆ షేవింగ్ అయిపోయింది. డబ్బులివ్వండి"

"మర్చిపోయినట్టున్నారు. బయట వున్న నా మిత్రుడికి కూడా చెయ్యాలి"

"ఓస్...అదెంత! " అంటూ... బయటికెళ్లి చూసి పెద్దగా కేక వేశాడు "ఏంటి? నీ మిత్రుడు గాడిదా?"

"అవును సాబ్"

"ఇప్పుడు నేను దీనికి షేవింగ్ చెయ్యాలా?'

"మరి ముందు నేను చెప్పింది అదేకదా. అప్పుడే నేను ఒక దినార్ ఇస్తాను"

"ఎక్కడైనా గాడిదకు షేవింగ్ చేసేవాడిని చూశావా? నేను మాత్రం చెయ్యను. నాకు రావలసిన డబ్బులు నాకు ఇచ్చేయ్" అన్నాడు కోపంగా.

మాటా మాటా పెరిగింది. ఇద్దరూ కలిసి న్యాయమూర్తి దగ్గరకెళ్లారు. ఆయన వీరిద్దరూ చెప్పింది విని...కాసేపు ఆలోచించి .... 'మొన్న గాడిద మీది కట్టెలన్నీ ఇస్తే ఐదు దినారాలు ఇస్తానన్నట్టే....ఇవాళ అతనికి, అతని గాడిదకు షేవింగ్ చేస్తే ఒక దినార్ ఇస్తాడు. అందుకు మొదట నువ్వూ అంగీకరించావు కదా. మరి ఇప్పుడు గాడిదకు షేవింగ్ చెయ్యనంటే ఎలా! చేసేయ్ త్వరగా. నాకు తీర్పు చెప్పాల్సిన కేసులు చాలా వున్నాయి మరి" అన్నాడు.

ఇక చేసేది లేక మనసులో తిట్టుకుంటూ గాడిద బొచ్చంతా గొరిగాడు. అంతా అయ్యేసరికి చేతులు పట్టేసినాయి. అప్పుడు సంచిలోంచి ఒక దినార్ తీసిచ్చాడు రహీం. కట్టెల విషయంలో మోసం చేసినందుకు ఇప్పుడు తనకు తగిన శాస్తి జరిగిందని అనుకున్నాడు. రహీం మాత్రం న్యాయమూర్తికి కళ్లతోనే ధన్యవాదాలు చెప్పుకుని ఇంటికి వెళ్లిపోయాడు.